PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...




ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 214, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 24 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-

## ఉత్తరాంధ్ర వైపు వేగంగా కదులుతున్న తీవ్ర వాయుగుండం.. ఈ రాత్రికి తీరం దాటే అవకాశం



2లో

- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం
- ఉత్తరాంధ్ర – దక్షిణ ఒడిశా తీరం వైపు వేగంగా పయనం
- ఈ రాత్రికి కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం
- విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుందని అంచనా
- తీర ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తం

## కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలు? క్లారిటీ ఇచ్చిన అధికారులు..!



2లో

### 'సర్' సహా అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే తీసుకున్నామన్న ఈసీ

- ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు చెప్పారన్న వార్తలను ఖండించిన అధికారులు
- కొన్ని అంశాలపై వారు పరిశీలనలు మాత్రమే చేశారని వెల్లడి
- 14 సందర్భాల్లో అభ్యంతరాలంటూ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం
- ఓటర్ల జాబితా కచ్చితత్వమే 'సర్' లక్ష్యమని స్పష్టీకరణ



## ఏపీలో నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లు.. క్యాబినెట్ ఆమోదం

అమరావతి: ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో పలు కీలక అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో రూ.1,548 కోట్లతో మౌలిక వసతుల పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి ఇన్‌ఫ్రా పనులకు అదనంగా రూ.644.98 కోట్లు, అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్ట్ పనులకు రూ.661 కోట్లు కేటాయించేందుకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ఎల్‌పీఎస్ రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనల సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం': ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్



2లో

- 'సర్' వివాదం నేపథ్యంలో ఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు
- 'ఓటు చోరీ' రాజ్యాంగంపై దాడి అని వ్యాఖ్య
- ఇద్దరు ఈసీల అభ్యంతరాలపై మీడియాలో కథనం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు
- 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనం
- ఎలాంటి అధికారిక భిన్నాభిప్రాయం లేదని ఈసీ స్పష్టీకరణ

# రాయలసీమకు లక్ష కోట్ల వరం.. అక్టోబర్ 2న హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన

### లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో ఆరు జిల్లాల్లో ప్రాజెక్టు అమలు

- నిర్మలా సీతారామన్‌తో కలిసి ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- రిలయన్స్ ఏర్పాటు చేయనున్న అగ్రికల్చర్ స్కూల్‌కు కూడా అంకురార్పణ
- వరుస కార్యక్రమాలతో ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు బిజీ బిజీ



అమరావతి: దశాబ్దాలుగా కరవుతో అల్లాడుతున్న రాయలసీమ రూపురేఖలను మార్చే బృహత్తర ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సుమారు లక్ష కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది. అక్టోబర్ 2వ తేదీన మదనపల్లెలో జరిగే కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా సీమ రైతాంగ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ 'పూర్వోదయ' పథకం కింద ఈ రాయలసీమ మిగతా 2 లో



2లో

## తీవ్ర వాయుగుండం.. సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

శ్రీకాకుళం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా వరకు ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

గోదావరి పరివాహక ప్రాంతాల్లోనూ భారీ వర్షాలకు అవకాశం ఉంది

కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

# స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది

### కూటమి క్లీన్ స్వీప్ చేయాలి: మంత్రుల భేటీలో నారా లోకేశ్

- అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు..
- ఎన్నికలు జరగవనే అపోహలు ఎవరికీ వద్దని వ్యాఖ్య
- ఉపాధ్యాయులపై దాడి చేసిన వారు పరారయ్యారని ఎద్దేవా



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని మిగతా 2 లో

## రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది జూరాల నీటి విడుదలపై కేటీఆర్

### జూరాల కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం

- పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప అన్న కేటీఆర్
- రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం దిగొచ్చిందని వ్యాఖ్య




హైదరాబాద్: జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మిగతా 2 లో




2లో

## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

- ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత
- ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు
- నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక

# విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే మార్పు

### దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది



ప్రభుత్వ పథకాల్లో ఎస్సీ, ఎస్టీలకే పెద్దపీట

అట్రాసిటీస్ బాధితులకు సత్వర న్యాయం

ఉన్నత స్థాయి కమిటీ సమీక్షలో ముఖ్యమంత్రి

హైదరాబాద్: విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై అణచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి మిగతా 2 లో

## 'ఏఐ'కి కొత్త పేరు పెట్టిన ట్రంప్.. ఇక నుంచి అలాగే పిలవాలట!



2లో

- ఏఐకి బదులు 'సూపర్ ఇంటెలిజెన్స్' అని పిలవాలన్న ట్రంప్
- ఆర్టిఫిషియల్ అంటే నకిలీ అనే భావన వస్తోందని వ్యాఖ్య
- అమెరికా ప్రభుత్వ పత్రాల్లో 'సూపర్ ఇంటెలిజెన్స్'నే కొనసాగిస్తామని ప్రకటన
- ఇతర దేశాలు కూడా ఇదే అనుసరించాలని సూచన
- ఏఐపై నియంత్రణకు నో చెప్పిన ట్రంప్

## ఉత్తరాంధ్ర వైపు వేగంగా కదులుతున్న తీవ్ర వాయుగుండం.. ఈ రాత్రికి తీరం దాటే అవకాశం

ఢిల్లీ: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తరాంధ్ర తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం, రాగల కొన్ని గంటల్లో తీరాన్ని తాకనుంది. బుధవారం రాత్రి ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఈ పరిణామంతో కోస్తా ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రస్తుతం ఈ వాయుగుండం గత ఆరు గంటలుగా గంటకు 5 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా కదులుతోంది. ఇది కళింగపట్నానికి ఆగ్నేయంగా 50 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి 120 కిలోమీటర్ల దూరంలో, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 150 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. పూరీకి ఇది 250 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వాయుగుండం పశ్చిమ-వాయవ్య దిశగా ప్రయాణించి, ఈ రోజు రాత్రి 8:30 నుంచి 11:30 గంటల మధ్య విశాఖపట్నం - గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుంది. ముఖ్యంగా కళింగపట్నానికి అత్యంత సమీపంలో ఇది భూభాగాన్ని తాకుతుందని అధికారులు స్పష్టం చేశారు. తీరం దాటే సమయంలో కూడా ఇది తీవ్ర వాయుగుండంగానే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాలోని తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బలమైన ఈదురు గాలులు వీస్తాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని హెచ్చరించారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని, తీర ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా సిద్ధం చేశారు.

### 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలంణ్ణ'

## ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్

ఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్నది తప్పని వ్యాఖ్యానిస్తూ.. 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం' అంటూ హెచ్చరించారు. 'ఓటు చోరీ' భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఓ వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. "ఎన్నికల సంఘానికి, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నా.. మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం. సమయం వస్తుంది. మిమ్మల్ని పట్టుకుంటాం. తప్పించుకోలేరు" అని అందులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు కారణమైన వివాదం ఓ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో మొదలైంది. పది నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది. అయితే ఈ కథనాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై అభిప్రాయాలు, సూచనలు మాత్రమే చేశారని.. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయం నమోదు కాలేదని ఈసీ వర్గాలు తెలిపాయి. 'సర్' సహా అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేశాయి. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ పార్లమెంటరీ కమిటీ సమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో పలువురు మంత్రులతో నిర్వహించిన ప్రత్యేక బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు జరుగుతాయని... ఎన్నికలు జరగవనే ఎలాంటి అపోహలు ఎవరికీ వద్దని ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు ఆయన స్పష్టతనిచ్చారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా వేగంగా పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక పోరులో కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు సన్నద్ధం కావాలని, సీట్ల అంశంపై కూటమి సమన్వయ కమిటీ, అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా ఆధారాలతో బయటకు వస్తుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'గొడ్డలి పార్టీ' నిరుద్యోగులకు ఎంతో మేలు చేసిన మెగా డీఎస్సీపై నిందలు వేస్తోందని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ శాప్ కార్యాలయం వద్ద క్రీడా కోటా ఉపాధ్యాయులపై గూండాలతో దాడులు చేయించి మీసాలు మెలేసిన వారు, పోలీసులు చట్టప్రకారం కేసులు నమోదు చేయగానే పరారయ్యారని ఎద్దేవా చేశారు. గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటం శుభపరిణామమని వ్యాఖ్యానించిన మంత్రి లోకేశ్... వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులను కోరారు. జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుకోవడానికి ఈ వర్షాలు ఎంతో అనుకూలిస్తాయని పేర్కొన్నారు.

## రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది

## జూరాల నీటి విడుదలపై కేటీఆర్

హైదరాబాద్: జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప" అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

### కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలు?

## క్లారిటీ ఇచ్చిన అధికారులు..!

ఢిల్లీ: ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహా ఎన్నికల సంఘం తీసుకున్న అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు నిర్ణయాలపై రికార్డులో అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై తమ అభిప్రాయాలను మాత్రమే వెల్లడించారని, వాటిని కమిషన్ పరిశీలించిందని పేర్కొంది. ఇటీవల 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం.. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొంది. తమకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై వారు అభ్యంతరాలు తెలిపినట్లు కథనం పేర్కొంది. ఎన్నికల సంఘం మాత్రం ఈ వాదనలను ఖండించింది. ఈసీ వర్గాల ప్రకారం.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే నిర్ణయాలు తీసుకున్నారు. కమిషన్ తీసుకున్న నిర్ణయాలపై ముగ్గురి సంతకాలు ఉంటాయని తెలిపింది. కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ నిర్ణయం అమల్లోకి వస్తుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే 'సర్' సహా అన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. 'సర్' వల్ల కొందరి ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతయ్యే అవకాశం ఉందంటూ ప్రతిపక్ష నేతలు గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితా కచ్చితత్వం, సమగ్రతను నిర్ధారించేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఈసీ చెబుతోంది.

## తీవ్ర వాయుగుండం.. సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

అమరావతి: రాష్ట్రానికి తీవ్ర వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలపై అత్యవసర సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం-కవిటి మధ్య తీవ్ర వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 85 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. శ్రీకాకుళం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా వరకు ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గోదావరి పరివాహక ప్రాంతాల్లోనూ భారీ వర్షాలకు అవకాశం ఉందన్నారు. కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి నదులు, వాగులు, వంకల్లో ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని చంద్రబాబు ఆదేశించారు. సీఎస్, డీజీపీతో పాటు మంత్రులు, వివిధ శాఖల అధికారులతో పరిస్థితిని సమీక్షించిన సీఎం.. రిజర్వాయర్లలో నీటి నిల్వలకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని దిశానిర్దేశం చేశారు. 261 మండలాల్లో వర్షాలపై ప్రత్యేక అంచనాలు ఉన్నందున 24, 25 తేదీల్లోనూ అప్రమత్తత కొనసాగించాలని సూచించారు.

# విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే మార్పు

మొదటి పేజి తరువాయి

రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం-1989 అమలుపై ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం రాష్ట్రస్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, బాధితులకు ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులతో కలిసి సీఎం సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతోపాటు.. చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 'ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం' అమలుపై 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్రస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ ఏర్పడ్డాక... సీఎం అధ్యక్షతన రాష్ట్రస్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

బాధితులకు సత్వరమే నష్టపరిహారం

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు గత ఐదేళ్లలో తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించారు. కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలి. బాధితులకు నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలి. బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలి. మానవీయ కోణంలో స్పందించి.. సకాలంలో సహాయం, పునరావాసం అందేలా చూడాలి" అని ఆదేశించారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను సీఎం ప్రస్తావించి.. బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం చేయాలని అధికారులకు నిర్దేశించారు.

జనాభా దామాషా ప్రకారం నిధులు

"దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతీ పథకం, కార్యక్రమంలో వారికి తగినంత ప్రాధాన్యమిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నాం. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16% ఉంటే.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో 31% మంది ఎస్సీలే. ఎస్టీల జనాభా 10% ఉంటే.. వారికి 17% ఇళ్లను మంజూరు చేశాం. 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నాం. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. దీనివల్ల దళితులు, గిరిజనులు, ఆదివాసీలు సహా పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనం అందుతోంది. చదువు ఒక్కటే జీవితాలను మారుస్తుంది. సమాజంలో అసమానతలకు, అణచివేత వంటి రుగ్మతలకు విద్యతోనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. పిల్లలను చదువుతో పాటు క్రీడలవైపు ప్రోత్సహించాలి" అని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### గుణాత్మక మార్పే లక్ష్యం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ఆత్మగౌరవం, సమానత్వం, విద్య, ఉపాధి, సంక్షేమం ద్వారా దళిత, గిరిజన వర్గాల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం-1989 అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష అనంతరం మంగళవారం సచివాలయంలో మంత్రి లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడుతూ... "తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారిగా రాష్ట్రస్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించడం.. ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ సమావేశాన్ని ఎందుకు నిర్వహించలేదు? దళిత వర్గాలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు జరిగినా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటీవల స్పీకర్‌ను అవమానించిన ఘటనపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు స్పందించకపోవడం దురదృష్టకరం. భారాసలోని దళిత నాయకులు కూడా స్పందించకపోవడం శోచనీయం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లకు నిధుల కొరత లేకుండా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది" అని పేర్కొన్నారు.

## రాయలసీమకు లక్ష కోట్ల వరం.. అక్టోబర్ 2న హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన

మొదటి పేజి తరువాయి

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సుమారు లక్ష కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది. అక్టోబర్ 2వ తేదీన మదనపల్లెలో జరిగే కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా సీమ రైతాంగ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ 'పూర్వోదయ' పథకం కింద ఈ రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు అందనుండగా, మరో రూ.60 వేల కోట్లను ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సమీకరించనున్నారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి నీరందిస్తూనే, మరోవైపు ఉద్యానవన పంటలను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంతాల్లో సంపద సృష్టించి, రైతుల ఆదాయాన్ని పెంచడమే ఈ హబ్ ప్రధాన ఉద్దేశం. ఇదే కార్యక్రమంలో భాగంగా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు కూడా శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయ రంగంలో అత్యున్నత ప్రమాణాలతో ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు.

వరుస కార్యక్రమాలతో సీఎం బిజీ

ఈ నెల 29వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటూ తీరిక లేకుండా గడపనున్నారు. సెప్టెంబర్ 29: ఉదయం విజయవాడలో జరిగే ఇస్రో కర్మయోగి మిషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో నిర్వహించే 'పల్లె పండుగ'కు హాజరవుతారు.

సెప్టెంబర్ 30: విజయవాడలో 24 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

అక్టోబర్ 1: రాష్ట్రవ్యాప్తంగా జరిగే 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు.

అక్టోబర్ 2: గాంధీ జయంతి సందర్భంగా ఉదయం మదనపల్లెలో హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం విజయవాడలో జరిగే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు.

అక్టోబర్ 3: విజయవాడలో జరిగే పాన్ ఐఐటీ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ వరుస కార్యక్రమాలతో సీఎం ఐదు రోజుల పాటు ప్రజలతో మమేకం కానున్నారు.

### 'ఏఐ'కి కొత్త పేరు పెట్టిన ట్రంప్..

## ఇక నుంచి అలాగే పిలవాలట!

ఢిల్లీ: కృత్రిమ మేధస్సు (ఏఐ)కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త పేరు పెట్టారు. ఇకపై 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'కు బదులుగా 'సూపర్ ఇంటెలిజెన్స్' (ఎస్ఐ) అనే పదాన్ని వాడాలని నిర్ణయించారు. 'ఆర్టిఫిషియల్' అంటే నకిలీ అన్న భావన వస్తోందని.. ఈ సాంకేతికత నిజమైనదే కాబట్టి ఆ పేరు సరైంది కాదని ట్రంప్ అన్నారు. న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ ప్రకటన చేశారు. ఇకపై అమెరికా ప్రభుత్వ పత్రాల్లో 'సూపర్ ఇంటెలిజెన్స్' అనే పదమే కనిపిస్తుందని చెప్పారు. ఇతర దేశాలు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఏఐపై ప్రపంచవ్యాప్తంగా నియంత్రణ తీసుకురావాలన్న ప్రయత్నాలను ట్రంప్ వ్యతిరేకించారు. సాంకేతికత అభివృద్ధిని అడ్డుకునే అంతర్జాతీయ వ్యవస్థను అమెరికా అంగీకరించబోదని స్పష్టం చేశారు. అయితే ఏఐతో కొత్త సవాళ్లు వస్తాయని చెప్పారు. అవసరమైనప్పుడు న్యాయశాఖ, చట్టాన్ని అమలు చేసే ఇతర సంస్థలు చర్యలు తీసుకుంటాయని తెలిపారు. అత్యాధునిక ఏఐ, రోబోలు మానవాళికి పెను ముప్పుగా మారొచ్చన్న హెచ్చరికలను ట్రంప్ కొట్టిపారేశారు. ఏఐ భవిష్యత్తులో పారిశ్రామిక విప్లవం, ఇంటర్నెట్ కంటే పెద్ద మార్పు తీసుకురావచ్చని అన్నారు. ఈ సాంకేతికత అభివృద్ధిని అడ్డుకునే చర్యలు తీసుకోబోమని చెప్పారు. ఏఐలో ఏ దేశం ముందుంటే దానిదే ప్రపంచంలో పైచేయి అవుతుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా ప్రస్తుతం చైనా కంటే చాలా ముందుందని అన్నారు. ఈ ఆధిక్యాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అయితే 'సూపర్ ఇంటెలిజెన్స్' అనే పేరును అన్ని ఏఐ వ్యవస్థలకు వాడతారా? అత్యాధునిక మోడళ్లకు మాత్రమే పరిమితం చేస్తారా? అన్నది ట్రంప్ స్పష్టంగా చెప్పలేదు. ప్రభుత్వ శాఖల్లో ఈ మార్పు ఎలా అమలవుతుందన్నదానిపైనా వివరాలు వెల్లడించలేదు.

## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

హైదరాబాద్: ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

## ఏపీలో నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లు..

### క్యాబినెట్ ఆమోదం

అమరావతి: ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో పలు కీలక అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో రూ.1,548 కోట్లతో మౌలిక వసతుల పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి ఇన్‌ఫ్రా పనులకు అదనంగా రూ.644.98 కోట్లు, అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్ట్ పనులకు రూ.661 కోట్లు కేటాయించేందుకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ఎల్‌పీఎస్ రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనల సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

### ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో

## రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం




ఢిల్లీ: రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు.

తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

తమిళనాడు: రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు.

ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

## స్థానిక ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేద్దాం



అమరావతి: 'సాధారణ ఎన్నికలు ప్రజల కోసం..స్థానిక ఎన్నికలు పార్టీ బలోపేతం కోసం.. ఆత్మాభిమానం తగ్గని రీతిలోనే జనసేన పోటీ చేస్తుంది. కూటమి ధర్మాన్ని పాటిస్తాం. అన్ని చోట్లా పొత్తులతోనే పోటీ చేస్తాం. అవసరమైతే మిత్రధర్మం పాటిస్తూనే పార్టీ బలంగా ఉందని కార్యకర్తలు నమ్మిన చోట పోటీకి దిగుతాం' అని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. కాకినాడలో మంగళవారం జనసేన పార్టీ రాష్ట్ర స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని అంతర్గతంగా నిర్వహించారు. పార్టీ నాయకులు తెలిపిన సమాచారం మేరకు అందులో పవన్‌కల్యాణ్ ప్రసంగం ఇలా ఉంది. 'స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సన్నద్ధం కావాలి. లోక్‌సభ స్థానాల వారీగా నియమించిన పార్టీ కమిటీలు మనం ఎక్కడెక్కడ బలంగా ఉన్నామో గుర్తించి సరైన నివేదికలు ఇవ్వాలి. పొత్తు ధర్మం పాటిస్తూనే మనం గెలిచే అన్ని స్థానాల్లోనూ పోటీ చేద్దాం. 2024 సాధారణ ఎన్నికలు రాష్ట్రం కోసం, రాష్ట్ర ప్రజల బాగు కోసమని దృష్టిలో ఉంచుకుని జనసేన కొన్ని త్యాగాలు చేసింది. ఈ స్థానిక ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసుకుందాం. కార్యకర్తలు, పార్టీ నాయకులు ఏం చెబితే ఆ ప్రకారమే ముందుకు వెళ్దాం. పార్లమెంటరీ కమిటీలు ముందుగానే వాస్తవిక అంచనాలతో కచ్చితమైన అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేస్తే స్థానిక ఎన్నికల్లోనూ వందశాతం విజయం సాధించడం పెద్ద కష్టం ఏమీ కాదు' అని పవన్‌కల్యాణ్ అన్నారు. స్థానిక ఎన్నికల పొత్తులో 15శాతం అంటూ పర్సంటేజీల లెక్కలపై కొన్ని ప్రచారాలు జరుగుతున్నాయని, అవి నిజంగా వారు మాట్లాడారో లేదో తనకు తెలియదని అన్నారు. 'మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల స్థాయిలోనే స్థానిక ఎన్నికల సర్దుబాట్లు జరిగిపోవాలి. తప్పనిసరి పరిస్థితులుంటే నేనే ముఖ్యమంత్రితో మాట్లాడతా. సాధారణ ఎన్నికల్లో నాయకుల గెలుపు కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తల ఎదుగుదలకు అందరూ పని చేయాలి. ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్యం ప్రదర్శించవద్దు. పురపాలక, నగరపాలక సంస్థలు, పరిషత్తు ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు బాధ్యత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తీసుకోవాలి. ఈ ఎన్నికల ఫలితాలు జనసేన గౌరవం పెంచేలా ఉండాలి' అని అన్నారు. పార్టీలోకి వచ్చేందుకు అనేక చోట్ల ఆసక్తి కనబరుస్తున్నారని, సరైన వారిని పార్టీలోకి ఆహ్వానించాలని పార్టీ అధినేత సూచించారు. తొలుత పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. ఇటీవల విశాఖలో తాను మాట్లాడిన కొన్ని అంశాలను కార్యకర్తలు అపార్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. పార్టీ విజయానికి నిబద్ధతతో పనిచేద్దామన్నారు. ఈ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్, ఎంపీలు ఉదయ్ శ్రీనివాస్, బాలశౌరి, లింగమనేని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## దసరా కు సామాజిక భద్రత పింఛన్లు పంపిణి : నూతి

**- హర్షం వ్యక్తం చేసిన సత్యనారాయణ**



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: రానున్న దసరా పండుగను పురస్కరించుకొని తెలంగాణలోని అర్హులైన ప్రజలకు అక్టోబర్ నెల నుంచి కొత్త సామాజిక భద్రతా పింఛన్లు (ఫెన్షన్లు) పంపిణీ చేయాలని మన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేసిన జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్. బుధవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రజల ముఖాల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా పనిచేస్తున్నదని చెప్పడానికి గర్వపడుతున్నానని, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రజాపాలన గావిస్తున్న ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే రాబోయే దసరా పండుగను పురష్కరించుకొని రాష్ట్రంలో కొత్తగా లక్షలాది మంది అర్హులైన ప్రజలకు అక్టోబర్ నెల నుంచే కొత్త పెన్షన్ల పంపిణీని ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు దనసరి సీతక్క,పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు, సహచర మంత్రి వర్గ సభ్యులు తీసుకొన్న నిర్ణయం అత్యంత అభినందనీయమని ఖమ్మం జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపినజిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం ఏళ్ల తరబడి వేచి చూసిన నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల కష్టాలను గుర్తించి వారికి దసరా పండుగ కానుకగా వారి చేతికి పెన్షన్ సొమ్ము అందే విధంగా అధికారులు రాత్రింబగుళ్ళు శ్రమిస్తున్నారని, లబ్దిదారుల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పండుగ లోపే అర్హులందరికి ఈ ఆర్ధిక భరోసా కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన మన ప్రజా ప్రభుత్వ అనుకూల విధానానికి నిదర్శనం అని పేద ప్రజల కళ్ళల్లో ఆనందం చూడటమే కాంగ్రెస్ మార్క్ పాలన. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమాన్ని ప్రతి ఇంటికి చేరుస్తూ మన ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షపాతి అని నిరూపిస్తూ పండుగ వేళ లబ్దిదారుల ఇళ్లల్లో వెలుగులు నింపబోతున్నందుకు మరొక్కసారి మన ప్రజా ప్రభుత్వానికి అభినందనలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్. అదే విదంగా మొన్న తిరుమలాయపాలెం మండలంలో వినాయక మండపాలలో పూజలు నిర్వహించి అన్నధాన కార్యక్రమాలలో పాల్గొని ఖమ్మం కు తిరుగు ప్రయాణమైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కారు పై బీ ఆర్ యస్ నాయకులు చేసిన రాళ్ళ దాడిపై తీవ్రంగా మండిపడ్డారు. బీ ఆర్ యస్ నాయకులు చిల్లర వేషాలు మానుకోవాలని హితవు పలికారు. మరల ఇటువంటి ఆకాతాయి చేష్టలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలుంటాయాని హెచ్చరించారు. అదే విధంగా పోలీస్ అధికారులు దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పత్రికా ముఖంగా కోరిన జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

## భాగ్యనగర్ లో ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహాన్నీ సందర్శించి దర్శనం చేసుకున్న పొంగులేటి సుధాకర్ రెడ్డి



ఖమ్మం, హైదరాబాద్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: భాగ్యనగర్ లోని శ్రీ ఖైరతాబాద్ బడా గణేష్ దివ్య దర్శనం భాగ్యం కలగడం ఎంతో ధన్యతను ఇచ్చింది అని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల సహా ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. వారితో పాటు బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ బద్దం మహిపాల్ రెడ్డి, గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శులు, ఖైరతాబాద్ బడా గణేష్ కార్యదర్శి వీణ, తదితరులు పాల్గొన్నారు.ఎంతో భక్తిశ్రద్ధలతో, భారతదేశంలోని ప్రతి పౌరుడి సుఖశాంతులు, శ్రేయస్సు, సౌభాగ్యం కలగాలని, దేశమంతటా సామరస్యం వర్ధిల్లాలని, 'వికసిత్ భారత్' సాధన దిశగా మన ఉమ్మడి సంకల్పం నెరవేరాలని ప్రత్యేక పూజలు నిర్వహించాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ సేవలో నిరంతరం శ్రమిస్తున్న ప్రతి ఒక్కరి ఆయురారోగ్యాలు, శక్తి సామర్థ్యాలు, నిరంతర ప్రజాసేవ కొనసాగాలని ప్రార్థించారు.విఘ్నహర్త అయిన శ్రీ గణేశుడు భారతదేశ పురోగతికి వచ్చే అన్ని అడ్డంకులను తొలగించి, మన దేశాన్ని శాంతి, ప్రగతి, ఐక్యత సమృద్ధితో ఆశీర్వదించాలని కోరారు.

## రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు అక్టోబర్ 2న శంకుస్థాపన

**- మదనపల్లెలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు**

**- 29వ తేదీ పల్లె పండుగ, 30వ తేదీన విజయవాడలో ఇళ్లపట్టాల పంపిణీ**

**- 5 రోజుల పాటు వరుస కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం చంద్రబాబు**

అమరావతి, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: రాయలసీమ దశ దిశ మార్చే హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రారంభించనుంది. మదనపల్లెలో అక్టోబర్ 2వ తేదీన కేంద్రమంత్రి నిర్మాలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ఈ ప్రాజెక్టును ప్రారంభిచనున్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్వోదయ పథకం కింద రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు వివిధ రూపాల్లో ఇవ్వనుంది. వీటికి తోడు మరో రూ.60 వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడుల ద్వారా రానున్నాయి. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర కృషితో, కేంద్రంతో సమన్వయంతో ఈ ప్రాజెక్టును సాధించారు. దీని ద్వారా కరువు పీడిత ప్రాంతాల్లో హార్టికల్చర్ రంగానికి ఊతం ఇచ్చే కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరు అందిస్తున్న ప్రభుత్వం మరోవైపు హార్టికల్చర్‌ను ప్రోత్సహించడం ద్వారా ఆ ప్రాంతాల్లో సంపద పెరిగేందుకు, రైతులు లబ్ది పొందేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. మదనపల్లెలో జరిగే ఈ కార్యక్రమంతో పాటు 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు కూడా శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయం రంగంలో అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు అయ్యే ఈ అగ్రికల్చర్ స్కూల్‌ను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేస్తోంది.

- సీఎం చంద్రబాబు వరుస కార్యక్రమాలు

ఈ నెల 29వతేదీ నుంచి 5 రోజుల పాటు సీఎం చంద్రబాబు వరుస కార్యక్రమాలు, పర్యటనల్లో పాల్గొననున్నారు. సెప్టెంబర్ 29వ తేదీన విజయవాడలో ఉదయం డిఓపిటి కర్మయోగి మిషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో జరిగే పల్లె పండుగ కార్యక్రమానికి హాజరవుతారు. 30వ తేదీ విజయవాడలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. 24 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నారు. అక్టోబర్ 1వ తేదీ 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేస్తారు. 2వ తేదీ మదనపల్లెలో హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన తరువాత స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొననున్నారు. 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించే వార్షిక స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం విజయవాడలో పాల్గొంటారు. 3వ తేదీ విజయవాడలో పాన్ ఐఐటీ సదస్సులో సీఎం పాల్గొంటారు.

## హైదరాబాద్ నిమ్స్ అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్ నివాసంలో భారీగా ఆస్తులు గుర్తింపు

**- దాదాపు రూ.70 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు నిర్ధారించిన ఏసీబీ అధికారులు**



హైదరాబాద్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: హైదరాబాద్ నిమ్స్ అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్ నివాసం లో భారీగా ఆస్తులు గుర్తించారు. హైదరాబాద్ లో భారీగా ఫ్లాట్లు, భవనాలు గుర్తించారు. చాలాసార్లు విదేశీ పర్యటనలు చేసిన లక్ష్మీభాస్కర్.అధికారం అడ్డుపెట్టుకుని లక్ష్మీభాస్కర్ అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ తనిఖీల్లో గుర్తించారు. ఏసీబీ సోదాల్లో ప్రస్తుతం తేలిన అక్రమాస్తుల వివరాలు. కూకట్ పల్లి ప్రాంతంలో 2 విలాసవంతమైన ప్లాట్లు. మణికొండ, పేట్‌బషీరాబాద్, కూకట్పల్లిలోని ప్రధాన అపార్ట్మెంట్లలో 5 ఖరీదైన ఫ్లాట్లు. యాదాద్రి, నందిగామ, శామీర్పేట్ ప్రాంతాల్లో 4 ఓపెన్ ప్లాట్లు. విశాఖపట్నంలో 800 గజాల భారీ స్థలం. నగదు, డిపాజిట్లు ఉన్నాయి. బ్యాంకు ఖాతాల్లో రూ.41 లక్షల నగదు. పోస్టాఫీస్ ఖాతాల్లో రూ. 12 లక్షల డిపాజిట్లు.పలు ప్రైవేటు సంస్థల్లో రూ. 35 లక్షల మేర పెట్టుబడులు.ఇంట్లో 517 గ్రాముల బంగారం లభ్యం. 3 ఖరీదైన కార్లు, 4 ద్విచక్ర వాహనాలు గుర్తించారు.

## నరేంద్ర మోదీ ఇచ్చిన 10 శాతంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి

**కాపు ఉద్యమ నేత పులి శ్రీరాములు డిమాండ్**



ఏలూరు, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :: ప్రధాని నరేంద్ర మోది అగ్రవర్ణాల పేదలకు ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్లలో కాపులకు ఇస్తామన్న 5 శాతం రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలని కాపు ఉద్యమ నేత, కాపు సంక్షేమ సేవాసంఘ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీరాములు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తియైనప్పటికీ కాపులకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాపు కార్పోరేషన్ కు నిధులు విడుదల చేయాలని,రాష్ట్రంలో 500 కాపు సామాజిక భవన్ లు నిర్మించాలని, జిల్లా కేంద్రాలలో కాపు కళ్యాణ మండపాలు నిర్మించాలని పులి శ్రీరాములు కోరారు. కూటమి ప్రభుత్వ పాలనలో రెండు సంవత్సరాలు ఎదురుచూశామని,ఇంతవరకూ కాపులకు ఇచ్చిన హామీల అమలుకు ఎటువంటి స్పందన లేదన్నారు. అయినా ముందుగా నిర్ణయించిన ప్రకారం కూటమి పార్టీల కు 2029 వరకు మద్దత్తు ఇస్తామని, అప్పటికీ కాపులకు న్యాయం జరగకపోతే తగు కార్యాచరణ చేపడతామని పులి శ్రీరాములు హెచ్చరించారు.

## చిరుజల్లుల వేళ వైభవంగా 'శ్రీగిరి గిరి ప్రదక్షిణ'




ఒంగోలు, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: ఆకాశం నుంచి కురుస్తున్న చిరుజల్లులు. భక్తుల గోవింద నామస్మరణ మారుమోగుతున్న వేళ ఒంగోలు నగరంలో 'శ్రీగిరి గిరి ప్రదక్షిణ' ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా జరిగింది.శ్రీ వేంకటేశ్వర స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని, భాద్రపద మాస శుక్ల ద్వాదశిని పురస్కరించుకుని బుధవారం ఉదయం 5 గంటలకు ఈ ప్రదక్షిణ ప్రారంభమైంది. స్థానిక శ్రీగిరి పాదపీఠం సమీపంలోని శ్రీ బాపూజీ గోశాల వద్ద భక్తులు ప్రత్యేకంగా గోపూజ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరోత్సవంగా సాగిన శోభాయాత్ర శ్రీలక్ష్మీ, పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగిస్తూ నగరోత్సవం నిర్వహించారు. ఈ శోభాయాత్ర బాపూజీ గోశాల వద్ద ప్రారంభమై కోర్టు సెంటర్, గ్రంథాలయం, కేశవస్వామిపేట, భగీరథ మందిరం, శర్మ కాలేజీ క్రికెట్ గ్రౌండ్, సీతారాంపురం, మామిడిపాలెం మీదుగా శ్రీగిరి కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు అట్టహాసంగా సాగింది. చల్లని వాతావరణంలో భక్తులు పరవశిస్తూ స్వామివారి పల్లకిని మోసి, స్వామివారిని దర్శించుకుని తరించారు. ఈ శ్రీశ్రీనివాస దివ్యానుగ్రహ సేవను అచ్యుత పూర్ణచంద్రరావు - లక్ష్మీ సుభాషిని దంపతులు, వారి కుమారుడు ప్రేమ్ హృదయ్, కోడలు భానులత నిర్వహించారు. శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం, సహ కార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, సభ్యులు కనమర్లపూడి బాలకోటేశ్వరరావు, ధనిశెట్టి రామునాయుడు ఈ కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టారు. ఈ వేడుకలో గ్రంధి సుధీర్, తెనాలి రాఘవ, దోగిపర్తి మల్లికార్జున, విశ్వనాధుల వెంకట సుబ్బారావు, దింటకుర్తి సుబ్బారావు, మధు, పల్లపోతు జాలయ్యలతో పాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## "వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్‌సీపీ పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి కొలుపూరి శివ కిరణ్"



తాడేపల్లిగూడెం సెప్టెంబరు 23 (నేటి -శుభోదయ)వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్‌సీపీ పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి కొలుపూరి శివ కిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కొలుపూరి శివ కిరణ్ మాట్లాడుతూ జగనన్నను కలిసి మాట్లాడటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని జగనన్న సూచించారని పేర్కొన్నారు.జగనన్నను కలిసేందుకు సహకరించిన తాడేపల్లిగూడెం పార్టీ కోఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయకలిసేందుకు కొలుపూరి శివ కిరణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**క్లస్టర్ ఇంచార్జ్ ఎం.సత్యనారాయణ**



దేవీపట్నం నేటి శుభోదయసెప్టెంబర్ 23 : వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వర్షాలు కురుస్తున్నందున మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని క్లస్టర్ ఇంచార్జ్ ముచ్చు వీర వెంకట సత్యనారాయణ సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే అధికారుల సాయం తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా వాగులు, వంకలు, పొంగిపొర్లే కల్వర్టులు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలని, వర్షాల సమయంలో చిన్నపిల్లలను బయటకు పంపవద్దని విజ్ఞప్తి చేశారు.అలాగే, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ అందుబాటులో ఉంటారని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు స్థానిక అధికారులను సంప్రదించాలని తెలిపారు.

## జట్లపాలెం గ్రామ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఎమ్మెల్యే బొలిశెట్టి"



పెంటపాడు సెప్టెంబర్ 23 (నేటి-శుభోదయ) పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, జట్లపాలెం గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.గ్రామ ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొణతాల వెంకటరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పుల్లా బాబి, మైలవరపు సుబ్బారాయుడు, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్ కసిరెడ్డి మధులత, ఏఎంసీ డైరెక్టర్ కొవ్వూరు లక్ష్మణ్ రెడ్డి, పాతూరి రాంప్రసాద్ చౌదరి కుదుళ్ళ శ్రీనివాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం

**ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరం విజయవంతం**

**ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు**



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యశాలల ఆధ్వర్యంలో ఉచిత "ఆయుర్వేద మెగా వైద్య శిబిరం" విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు బి.పి, షుగర్, కీళ్ల నొప్పులు, వాత రోగాలు తదితర ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరానికి దాదాపు 436 మంది రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ ప్రజలు ఆయుర్వేద వైద్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ 'యోగా'ను దైనందిన జీవితంలో ఒక ముఖ్య భాగం చేసుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యులు డాక్టర్ కె. పద్మావతి (సీనియర్ మెడికల్ ఆఫీసర్ అండ్ నోడల్ ఆఫీసర్), డాక్టర్ వై. ఉపేందర్ (సీనియర్ మెడికల్ ఆఫీసర్ అండ్ డిప్యూటీ నోడల్ ఆఫీసర్), డాక్టర్ బి. సుధాకర్ (మెడికల్ ఆఫీసర్ అండ్ డిప్యూటీ నోడల్ ఆఫీసర్), డి.పి.ఎం. బాబూనాయక్ లతో పాటు ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది, యోగా ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మాజీ కౌన్సిలర్ జోగుపర్తి ప్రభాకర్ రావు కూడా పాల్గొని తమ సందేశాన్ని అందించారు. జోగుపర్తి వైద్య శిబిరం విజయవంతానికి ఎంతో సహకరించారని డాక్టర్ రామారావు వివరించారు.

## శ్రీరామనవమి నాటికి నిర్మాణ పనులన్నీ పూర్తి కావాలి

**రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**- భద్రాచల దేవస్థానంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు, ప్రాకారాల నిర్మాణాల పరిశీలన - సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష**



ఖమ్మం, భద్రాచలం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: వచ్చే ఏడాది శ్రీరామనవమి నాటికి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రాకారాలు, మాడ వీధుల పున:నిర్మాణ పనులు పూర్తి కావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం మహబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, డిసిసి అధ్యక్షురాలు తోట దేవి



ప్రసన్న లతో కలిసి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు అందజేశారు.

### - వర్షం కురుస్తున్నా పనుల పరిశీలన

బుధవారం ఉదయం నుంచి భద్రాచలం పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నప్పటికీ ముందస్తు షెడ్యూల్ ప్రకారం మంత్రి పొంగులేటి దేవాలయం చేరుకున్నారు. దమ్మక్క అన్నదాన సత్రం నుంచి మెట్లదారి వరకు వర్షపు చినుకులు కురుస్తున్నా, బురదలోనే దేవస్థానం చుట్టూ కలియతిరిగి నేరుగా పనులను పరిశలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం నెలకొనొద్దని సూచనలు చేశారు. ఆ తర్వాత భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.

### - వంద శాతం పనులు పూర్తి చేయిస్తాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూ.300 కోట్ల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈనెల 4వ తేదీన పరిశీలించానని, మళ్లీ ఇప్పటివరకు జరిగిన పురోగతిని నేరుగా తెలుసుకునేందుకు వచ్చినట్లు వెల్లడించారు. అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం పునఃనిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందేలా సకాలంలో పూర్తి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రోక్లేన్ ద్వారా కాలువలను బాగుచేయించిన టిడిపి యువ నాయకులు

**లలితా రామకృష్ణ**



విస్సన్నపేట : నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్) : తిరువూరు నియోజక వర్గం విస్సన్నపేట మండలంలో గత రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా విస్సన్నపేట గ్రామ పంచాయితీలో సరైన నీటి పారుదల వ్యవస్థ లేకపోవటంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారనే విషయం తెలుసుకొని యుద్ధ ప్రాధిపధికన స్థానిక యువ నాయకులు శ్రీ లలితా రామకృష్ణ(కోటపాటి) ఆధ్వర్యంలో తమ సొంత ధనంతో ప్రాక్లేయిన్ ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ వరద నీటిని గ్రామ వెలుపలకు పంపించేందుకు శక్తి వంచన లేకుండా ఉదయం నుండే డ్రైనేజీలలోని పూడిక తీయించి నీటి పారుదలను క్రమంబద్ధికరిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్ల పైకి వచ్చే నీటిని కాలువలకు మరల్చి మురుగు కాలువలు సైతం పూడికలు తీయిస్తూ ప్రజా క్షేమమే ధ్యేయంగా దగ్గరుండి పనిచేస్తున్నారు, ప్రధానంగా నూజివీడు రోడ్డు దగ్గర రాయల్ బ్యాకరీ మొదలుకొని లక్ష్మీటాకీస్ సెంటర్ నుండి ఏ కొండూరు రోడ్డులోని కోతమిషన్ తదితర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరివేక్షిస్తూ ఎక్కడ కూడా ప్రజలకు వరద వల్ల ఇబ్బంది కలుగకుండా కాలువలను బాగుచేస్తున్న గొప్ప మంచి మనసున్న మారాజు అని లలితా రామకృష్ణ అని ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తపరుస్తున్నారు, అకాల వర్షాల వలన కురుస్తున్న వరద నీటిని గురించి ఎవరు పట్టించుకోలేదని లలితా రామకృష్ణ ఈ విషయంలో మమ్మల్ని పట్టించుకొని ఇలాంటి విపత్తు సమయంలో ఆపద్బాంధవుడుగా నేను ఉన్నాను అని ముందుకు వచ్చి ప్రజా సేవ చేస్తున్న శ్రీ లలితా రామకృష్ణ కి చేతులెత్తి మొక్కుతున్న ప్రజానీకం. నిజంగా ఇలాంటి యువత సమాజానికి ఏంతో అవసరం అని మేధావులు చేర్చించుకుంటున్నారు. ప్రజలకు సేవ చెయ్యాలి అనే భావన రావటమే గొప్ప విషయం అలాంటిది ఫలితం ఆశించకుండా విస్సన్నపేట చుట్టు ప్రక్కల ప్రజలకు శ్రీ లలితా రామకృష్ణ చేస్తున్న సహాయ సహకారాలు అమోఘం ఇలాంటి వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకుంటే ఇటు ప్రజలకు అటు సమాజానికి మేలు జరుగుతుందని పలువురికి అభిప్రాయం

## అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

**– రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన**




ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.

## రైలు ఢీకొన్న ఘటనలో నలుగురి మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి

అమరావతి, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలో రైలు ఢీకొని నలుగురు విద్యార్థులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైలు ఢీకొని విశాఖరావు, దిలీప్ కుమార్, శివ, శరత్ కుమార్ అనే నలుగురు విద్యార్థులు మృతి చెందడం విషాదకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఘటనపై అధికారులను అడిగి సీఎం చంద్రబాబు వివరాలు తెలుసుకున్నారు. రైలు రాకను గమనించలేకపోవడంతో ప్రమాదం జరిగిందని అధికారులు వివరించారు. ప్రమాదంలో సాల్మన్‌రాజ్ అనే మరో విద్యార్థి గాయపడ్డారని, అతనికి ప్రస్తుతం టెక్కలి డీహెచ్‌లో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. సాల్మన్‌రాజుకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం సూచించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, మద్దతుగా నిలవాలని అధికారులను ఆదేశించారు.

## "పలువురు వైసీపీ కార్యకర్తలను పరామర్శించి వైసీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురాం నాయుడు"



తాడేపల్లిగూడెం సెప్టెంబరు 23 ( నేటి- శుభోదయ) తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు మండలాల్లో అనారోగ్యంగా ఉన్న పలువురు వైసీపీ కార్యకర్తలను బుధవారం తాడేపల్లిగూడెం వైసీపీ ఇన్చార్జ్ వడ్డీ రఘురాం నాయుడు పలువురిని పరామర్శించారు. ముందుగా పెంటపాడు మండలం బి కొండేపాడు గ్రామానికి చెందిన అట్టి రమణబాబు కి యాక్సిడెంట్ అయిందని తెలుసుకొని కొండేపాడు గ్రామానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

అనంతరం రామచంద్రపురం గ్రామానికి చెందిన తిప్ప మల్లికార్జున రావు అకాల మరణం చెందారని తెలుసుకొని ఆయన కుటుంబానికి వెళ్లి పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తాడేపల్లిగూడెం రూరల్ మండలం పుల్లాయ్య గూడెం ఎంపీటీసీ సభ్యులు మార్లపూడి సుబ్బారావు కుమారుడు అనారోగ్యంగా ఉన్నారని తెలుసుకొని ఆ కుటుంబానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి 10,000/- (పదివేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించారు.

అదే గ్రామానికి చెందిన బాటిరెడ్డి శ్రీను ను మరియు మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం బంగారు గూడెం మాజీ ఎంపీటీసీ సభ్యులు బుర్ర కట్లయ్య కుమారుడు శ్రీను చేతికి గాయమై ఇంటిదగ్గర ఉండి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలిసి ఆ కుటుంబానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే గ్రామానికి చెందిన కంచర్ల వెంకటేష్ చేతికి గాయమై ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఈ విషయం తెలుసుకొని ఆయనను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కొల్లి సహదేవ్ ఇటీవల అకాల మరణం సిందారని తెలుసుకొని ఆ కుటుంబానికి వెళ్లే పరామర్శించి ధైర్యం చెప్పి సహదేవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్, నల్లిమిల్లి విజయనందరెడ్డి, మాకినీడి సతీష్, పాలకోడేటి సురేష్, దేవరశెట్టి రాంబాబు, చల్లా లింగమూర్తి, చల్లా కుమారస్వామి, ఆయా గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## "సేవా సంకల్ప్ చిత్రాలేఖనం పోటీలలో పాల్గొన్న 200 మంది విద్యార్థులు'




' తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 23 (నేటి- శుభోదయ) భారతీయ జనతా పార్టీరాష్ట్ర పార్టీ పిలుపుమేరకు తాడేపల్లిగూడెం తేతలి సత్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ హై స్కూల్ లో పిఎంశ్రీ సేవ సంకల్ప అభియాన్ చిత్ర లేఖనం పోటీలు ప్రధాన ఉపాధ్యాయులు ఏం. సత్యనారాయణ పర్యవేక్షణ లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చిత్రాలేఖనం పోటీల నిర్వహించారు. చిత్రలేఖనం వ్యాసరచన పోటీలలో ఉత్తీర్ణులైన వారికి బహుమతిగా పెన్నులు అందించారు. ఈ సందర్భంగా ఈతకొడ తాతాజీ మాట్లాడుతూ విద్యార్థులలో జనరల్ నాలెడ్జ్ సంబంధించి మేధాశక్తిని పెంపొందిస్తాయని ఇటువంటి పోటీలలో విద్యార్థులు అందరూ పాల్గొని తమ మేధాశక్తిని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈతకోట భీమశంకరరావు (తాతాజీ), రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామగాని సత్యనారాయణ, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారిసెట్టి నరసింహమూర్తి, మహిళా మోర్చా అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి తుట్టగుంట కృష్ణ కుమారి,పట్టణ యువమోర్చా అధ్యక్షులు కంచర్ల రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖం పోటీలలో పాల్గొన్న వారిని ప్రతి ఒక్కరిని అభినందించారు.

## ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి

ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: ప్రస్తుత పరిస్థితులలో ప్రతీ ఒక్కరూ ఆహరపు ఆలవాట్లు మార్చుకోవాలని కమ్యూనీటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ డాక్టర్.మంగళ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హస్పిటల్ లో బుధవారం ఆయుర్వేద దినోత్సవం ను నిర్వహించారు. తొలుత మహర్షి ధన్వంతరి చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైద్య శిభిరం ను నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆయుర్వేద గొప్పతనం ను వివరించారు. ఔషద మొక్కల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్.రాజా, డాక్టర్.నీలిమ, ఫార్మసిస్ట్ మాన్సింగ్ ' యోగా ఇన్ ట్రక్చర్స్ క్రాంతి. ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## బధిరుల సంక్షేమానికి అన్నివిధాల అండగా రాష్ట్ర ప్రభుత్వం

**జిల్లా రెవెన్యూ అధికారి మాలోల**




అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 23 నేటి శుభోదయ: బధిరుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి తెలిపారు . బుధవారం ఉదయం జిల్లా పరిషత్ మీటింగ్ హాలు నందు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, ఒ వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బధిరుల మరియు సైన్ లాంగ్వేజ్ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి మాలోల ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి జిల్లా పరిషత్ చైర్మన్ గిరిజమ్మ, సెక్రటరీ, ఋూూూ, డిఎల్ ఎస్ ఏ అనంతపురం, సర్వ శిక్ష అభియాన్ ఐ ఈ డి కో ఆర్డినేటర్, ఆర్డిటి సహాయ ప్రతినిధి యుగంధర్, పలువురు బదిరుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిధులు తొలుత అంతర్జాతీయ బధిరుల సైన్ లాంగ్వేజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నారాయణ స్వామి మాట్లాడుతూ వినికిడి లోపం అనేది ఒక బలహీనత కాదని అది ఒక ప్రత్యేకమైన జీవనశైలి అని గుర్తుంచుకోవాల్సిన అవసరంఉందన్నారు. సమాజంలో వినికిడి లోపం ఉన్నవారు ఒక అంతర్భాగమని వారందరూ కూడా మనలాగే కలలు ఆశయాలు సామర్థ్యాలు కలిగి ఉంటారని ముఖ్యంగా సైగల భాష ద్వారా వారు తమ భావాలను ఆలోచనలను వ్యక్తపరచగలరని తెలిపారు. బధిరులను ఆత్మీయంగా పలకరించే క్రమంలో సైగల భాషను నేర్చుకోవడం ద్వారా వారితో మరింత సులువుగా ఉండ వచ్చునని, అలాగే వారి ఆలోచనలు భావాలను కూడా గుర్తించేందుకు వీలుంటుంది అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాజంలో వినికిడి లోపం ఉన్న వారిని అన్ని విధాల ఆదుకునేందుకు వారిని అనేక విధాల కార్యక్రమాల ద్వారా అవకాశాలు కల్పించడం జరుగుతున్నట్లు తెలిపారు. విద్య



ఉద్యోగం ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు, అలాగే జిల్లా న్యాయ సేవ సదన్ లో సైన్ భాష ఇంటర్ప్రెటర్ ను కూడా నియమించే దిశగా ప్రయత్నం చేస్తామని సెక్రటరీ డి ఎల్ ఎస్ ఏ రాజ శేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా వైద్య శిబిరాల ఏర్పాటు పాఠశాలల్లో సైగల భాష ఉపాధ్యాయులను నియమించడం, అర్హులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం, పని ప్రదేశాలలో సైగ భాషలో సంభాషించే విధంగా అవకాశం కల్పించడం వంటివి జరుగుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పేర్కొన్నారు. బధిరుల సంక్షేమం కొరకు అనంతపురం జిల్లాలో ఇప్పటివరకు 45 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం జరిగిందని అలాగే అర్హులైన 6,707 మంది బధిరులకు పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతున్నట్లు తెలిపారు.బధిరులు కూడా మనోధైర్యంతో ముందుకు సాగుతూ అన్ని రంగాలలోనూ విజయం సాధించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జి. అర్చన పేర్కొన్నారు. బధిరులలో కూడా అనేక ప్రతిభ పాటవాలు నైపుణ్యాలు ఉంటాయని వాటిని గుర్తించి సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో సేవలందించాల్సిన అవసరం ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా అర్హులకు శ్రవణ యంత్రములు లాప్టాప్ లు టచ్ ఫోన్లు తదితర వాటిని పంపిణీ చేయడం జరుగుతుందని అలిమ్కో ద్వారా జిల్లాలో 948 మంది బదిరులను శ్రవణ యంత్రంల కొరకు గుర్తించడం జరిగిందని త్వరలోనే వీరికి శ్రవణ యంత్రంలో పంపిణీ చేస్తారని జి. అర్చన గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, సహాయ సంస్థ మరియు వసతి గృహ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి




ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: ప్రస్తుత పరిస్థితులలో ప్రతీ ఒక్కరూ ఆహరపు ఆలవాట్లు మార్చుకోవాలని కమ్యూనీటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ డాక్టర్.మంగళ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హస్పిటల్ లో బుధవారం ఆయుర్వేద దినోత్సవం ను నిర్వహించారు. తొలుత మహర్షి ధన్వంతరి చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైద్య శిభిరం ను నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆయుర్వేద గొప్పతనం ను వివరించారు. ఔషద మొక్కల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్.రాజా, డాక్టర్.నీలిమ, ఫార్మసిస్ట్ మాన్సింగ్ ' యోగా ఇన్ ట్రక్చర్స్ క్రాంతి. ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## "స్వచ్ఛత హిసేవ లో 8వ వార్డు ఎన్టీఆర్ బొమ్మ వద్ద నుండి శేషమహల్ రోడ్ లో క్లీనింగ్"



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 23 (నేటి- శుభోదయ) తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హిసేవ 2026 లో భాగంగా ఈరోజు 8వ వార్డు ఎన్టీఆర్ బొమ్మ వద్ద నుండి శేషమహల్ రోడ్డు వరకు శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ఏసుబాబు నేతృత్వంలో జరిగింది. కమిషనర్ ఏసుబాబు స్వయంగా చీపురు పట్టి రోడ్డుపై ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శ్రమదానం చేశారు.రోడ్డు పక్కన పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తను ట్రాక్టర్ల సహాయంతో తొలగించి, రోడ్డును పూర్తిగా శుభ్రపరిచారు.ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ స్వచ్ఛత హిసేవ లో భాగంగా ప్రతి వార్డులో దశలవారీగా శుభ్రతా కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రజలు రోడ్లపై చెత్త వేయవద్దని తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సిబ్బందికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కరువు గ్రామాలకు రెండు లక్షల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి



: బి. వెంకట్ భద్రాచలం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: వర్షాకాలం ముగింపు దశకు వచ్చినా దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాభావం వల్ల తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నాయని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. పని దొరకక గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు ఆకలి, అప్పులు, వలసల బారిన పడుతున్నారని వెంకట్ అన్నారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ భవన్ లో జరుగిన సభ లో ఆయన మాట్లాడుతూ2026లో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ ముందే హెచ్చరించినా ముందస్తు సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయనీ విమర్శించారు. కరువు ముంచుకొస్తున్నప్పుడు పేద ప్రజలను మార్కెట్ దయాదాక్షిణ్యాలకు వదిలేయడం తగదని అన్నారు, పని-ఆహారం-ఆదాయ భద్రత కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. కరువును కేవలం వ్యవసాయ సమస్యగా చూడకుండా, ప్రజల జీవనోపాధి సంక్షోభంగా పరిగణించి అత్యవసర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కరువు ప్రభావిత ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను తక్షణమే ప్రారంభించి, పని అడిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించాలని బి. వెంకట్ డిమాండ్ చేశారు. ఇందుకోసం ఉపాధి హామీ పథకానికి అదనంగా రెండు లక్షల కోట్లను కేటాయించాలన్నారు. చెరువులు, కుంటలు, కాలువల పూడికతీత, నీటి సంరక్షణ పనుల ద్వారా భవిష్యత్తులో కరువును తట్టుకునే శాశ్వత గ్రామీణ ఆస్తులను సృష్టించవచ్చని పేర్కొన్నారు కరువు ప్రభావం పట్టణాల్లో ని అసంఘటిత రంగ కార్మికుల పైనా తీవ్రంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ పేదలకూ విస్తరించి, పారిశుధ్యం,



పచ్చదనం, నీటి వనరుల పునరుద్ధరణ పనుల ద్వారా వారికీ స్థిరమైన ఉపాధి చూపాలని కోరారు. కరువు సమయంలో కొనుగోలు శక్తి పడిపోతుంది కాబట్టి, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, గోధుమల ప్రస్తుత కోటాను వెంటనే రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. వాటితో పాటు అన్ని నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించి, దేశంలో ఏ ఒక్క కుటుంబం కూడా ఆకలితో అలమటించకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని క్షేత్రస్థాయిలో నడిపిస్తున్న బేర్‌ఫుట్ టెక్నీషియన్లు, ఇతర ఉపాధి సిబ్బందిని ఏళ్ల తరబడి అనిశ్చితిలో ఉంచడం దారుణమన్నారు. ఉపాధి సిబ్బందికి నెలకు కనీసం రూ.26,000 వేతనం ఇవ్వాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలనీ డిమాండ్ చేసారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కరువు ప్యాకేజీని ప్రకటించాలని లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బి. వెంకట్ స్పష్టం చేశారు.

## వీడ్కోలు వేళ.. అభిమానంతో తడిసిన ఎంపీపీ




పులిచెర్ల, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయం): పులిచెర్ల మండల ఎంపీపీగా డి. సురేంద్రనాథ రెడ్డి పదవీకాలం గురువారంతో ముగియనున్న నేపథ్యంలో బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో మండల అధికారులు, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి ని అధికారులు, ఎంపీటీసీలు, ప్రజలు ఘనంగా సన్మానించారు. అభిమానంతో తరలివచ్చిన జనంతో కార్యాలయ ప్రాంగణం సందడిగా మారింది. సన్మానాల మధ్య ఎంపీపీ భావోద్వేగానికి గురయ్యారు.



## దంసలాపురం, కొత్తగూడెం చెరువుల్లో వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు దంసలాపురం, కొత్తగూడెం చెరువుల్లో మున్సిపల్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. 1,300 వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మొత్తం 13 క్రేన్లను ఏర్పాటు చేశారు. వీటిలో 10 క్రేన్లను నిమజ్జన కార్యక్రమానికి వినియోగిస్తుండగా, మరో 3 క్రేన్లను సపోర్ట్‌గా అందుబాటులో ఉంచారు. అదనంగా ఒక రొటేటింగ్ క్రేన్‌తో పాటు ఒక పెద్ద ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతంలో 22 సీసీ కెమెరాలు, 350 లైట్లు ఏర్పాటు చేసి, ఎంట్రన్స్ నుంచి ఎగ్జిట్ వరకు తగినంత వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు మైక్ సిస్టమ్‌తో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. శానిటేషన్ నిర్వహణ కోసం మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించడంతో పాటు, ప్రతి షిఫ్టుకు 10 ట్రాక్టర్ల చొప్పున అందుబాటులో ఉంచారు. నిమజ్జన కార్యక్రమంలో సహాయక చర్యల కోసం ఫిషరీస్ శాఖకు చెందిన 150 మంది సిబ్బందిని మూడు షిఫ్టుల్లో విధుల్లో నియమించారు. పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా సీపీ సునీల్ దత్ , ట్రైనీ కలెక్టర్ పరాస్ కుమార్, మాజీ మేయర్ పి. నీరజ, సుడా చైర్మన్ పువ్వాళ దుర్గాప్రసాద్ తదితరులు, స్తంభాద్రి ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి మున్సిపల్ కమిషనర్ నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. క్రేన్ పనితీరు, కంట్రోల్ రూమ్ నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, లైటింగ్, శానిటేషన్, సిబ్బంది విధులు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో అధికారులు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కష్టకాలంలో రైతు కుటుంబాలకు అండగా నిలవాలి

**కరువుపై ప్రభుత్వం కనీసం ప్రకటన చేయకపోవడం దారుణం.**

**ఎన్ని ఎకరాల్లో ఏ పంటలు సాగు చేశారో.. ఎంత నష్టం జరిగిందో ప్రభుత్వానికి తెలియదా**

**తుంగభద్ర డ్యాంలో నీళ్లున్నా పీఏబీఆర్ కుడికాలువకు నీళ్లు ఎందుకు ఇవ్వడం లేదు**

**పేరూరు డ్యాంకు నీళ్లిస్తే వందలాది ఎకరాల పంటలను కాపాడొచ్చు..**

**వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మూడేళ్లు పేరూరు డ్యాంకు నీళ్లిచ్చాం.**

**నేడు రైతుల పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది.**

**తీవ్ర కరువుతో వలసలు.. ఎండిపోతున్న పంటలు..**

**అడుగంటుతున్న భూగర్భజలాలు.**

**వేలాది బోర్లు ఎండిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.**

**హంద్రీనీవా కాలువకు లైనింగ్‌తో రైతులకు ఇబ్బందులు.**

**జెండాలు, అజెండాలు పక్కనపెట్టి రైతుల కోసం ఒక్కటవుదాం.**

**రైతులకు అండగా పోరాటం కొనసాగిస్తాం..**

**రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి**



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 23 నేటి శుభోదయ : రైతాంగాన్ని కాపాడుకునేందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా 'రైతు పార్టీ'గా ఏకం కావాల్సిన అవసరం ఉందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. అనంతపురం టవర్‌క్లాక్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న కరువుదీక్షకు బుధవారం ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ప్రజా సమస్యలపై సీపీఐ చేపట్టే ప్రతి ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. అందరికీ ఏకైక శత్రువు కరువేనని, అన్నంపెట్టే రైతులకు ఆపద వచ్చిందన్నారు. పార్టీలకు అతీతంగా రైతులు ఏకం కావాలని, కష్టకాలంలో రైతు కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. పార్టీలు, ఇతర భేషజాలకు పోయి రైతులను ఏకాకి చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు సాగు చేశారు, కరువు ప్రభావంతో రైతులు ఏ మేరకు నష్టపోయారన్న వివరాలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు డ్యాష్‌బోర్డు ముందు ఉన్నప్పటికీ కరువుపై కనీసం ప్రకటన చేయడం లేదని ప్రకాష్ రెడ్డి విమర్శించారు. తుంగభద్ర డ్యాంలో నీళ్లున్నా పీ.ఏ.బీ.ఆర్ కుడికాలువకు నీళ్లు ఇవ్వడం లేదన్నారు. పేరూరు డ్యాంకు నీళ్లు ఇవ్వాలని అనేక వేదికలపై వైఎస్సార్‌సీపీ గళం విప్పుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నీరు లేక డ్యాం కింద వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వరుసగా మూడేళ్లు పేరూరు డ్యాంకు నీళ్లు ఇచ్చామని, దీంతో అనంతపురం నగరం వరకు భూగర్భజలాలు పెరిగి వందలాది గ్రామాల్లో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. జెడ్పీ సమావేశంలో ఎంపీ పార్థసారధి కాలువ పూర్తయిన తర్వాత పేరూరు డ్యాంకు నీళ్లిస్తామని చెబుతున్నారని, మరోవైపు చంద్రబాబు అసెంబ్లీలో 2028 నాటికి కాలువ పనులు పూర్తి చేస్తామని చెబుతున్నారని తెలిపారు. పదేళ్లలో కేవలం 30 శాతం పనులు చేసి, రానున్న 15 నెలల్లో మిగిలిన 70 శాతం పనులు పూర్తి చేస్తామంటే రైతులు నమ్మాలా అని ప్రశ్నించారు. మడకశిర బ్రాంచ్ కాలువ నుంచి తురకాలపట్నం వద్ద నీళ్లు వదిలితే పెన్నా నది కాలువ ద్వారా పేరూరు డ్యాంకు నీళ్లు చేరుతాయని చెప్పారు. ప్రభుత్వం నుంచి రూపాయి తీసుకోకుండా దాదాపు 60 కిలోమీటర్ల కాలువ తవ్వి, మూడేళ్ల పాటు పేరూరు డ్యాంను నింపామని తెలిపారు. ప్రస్తుతం తీవ్ర కరువుతో ప్రజలు వలసలు వెళ్తున్నారని, పంటలు ఎండిపోతున్నాయని, చెట్లు కొట్టేస్తున్నారని, వేలాది బోర్లు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ వేసి రైతుల నోట్లో దుమ్ము కొట్టారని విమర్శించారు. ముఖ్యంగా హిందూపురం పార్లమెంట్ పరిధిలో లక్షల ఎకరాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. శ్రీశైలంలో 70 రోజుల పాటు నీరిచ్చేంత నీటి నిల్వలు ఉన్నప్పటికీ రైతును బతికించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీఎం జిల్లాకు రావడం లేదని, మంత్రి నారా లోకేష్ విగ్రహావిష్కరణలు చేసి నాలుగు మాటలు చెప్పి వెళ్లారని, కరువు, రైతు, నీళ్ల గురించి మాట్లాడలేదని ప్రకాష్ రెడ్డి విమర్శించారు. ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లోకి వెళ్తున్న తమపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. 26 నెలల్లో తనపైనా, తన సోదరులపైనా 22 కేసులు పెట్టారని తెలిపారు. కేసులకు తాము భయపడబోమని, ప్రజల కోసం పోరాడేందుకు ముందుంటామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి ప్రజల్లోకి వెళ్తే ఎంతమందిపై కేసులు పెడతారని ప్రశ్నించారు. జెండాలు, అజెండాలు పక్కన పెట్టి రైతుల కోసం ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. ఇది ప్రభుత్వ స్పాన్సర్డ్ కరువని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఏడాది క్రితమే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రైతులకు అండగా పోరాడతామని స్పష్టం చేశారు.



## నరసాపురంలో భక్తుల సౌకర్యార్థం స్నానఘట్టం నిర్మాణం..

**– గ్రామ అభివృద్ధికి, ప్రజా సేవకే నా తొలి ప్రాధాన్యం..**

**– :నరసాపురం సర్పంచ్ అభ్యర్థి కోర్పు రాజేష్**



కోరుకొండ సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం నరసాపురం గ్రామంలో గ్రామ ప్రజలు, రైతులు, భక్తుల సౌకర్యార్థం సర్పంచ్ అభ్యర్థి కోర్పు రాజేష్ దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు తమ స్వంత నిధులతో పుష్కర కాలువకు మెట్లను ఏర్పాటు చేసి, (స్నానఘట్టం) శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోర్పు రాజేష్ మాట్లాడుతూ.. గ్రామంలోని భక్తులు, రైతులు స్నానాలు చేయడానికి పడుతున్న ఇబ్బందులను గమనించి, వారి సౌకర్యార్థం ఈ పుష్కరాల మెట్లను నిర్మించినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నరసాపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. ఇప్పటికే గ్రామంలోని పలు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ప్రజా అవసరాలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి మరియు ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని స్పష్టం చేశారు. ఊరి ప్రజల ఆశీస్సులు, మద్దతు తనపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, రైతు సోదరులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని కోర్పు రాజేష్ దంపతుల సేవా నిరతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు



కోర్పు కృష్ణ ప్రసాద్, పితా శ్రీను, బొల్లంపల్లి శ్రీను, గుర్రం ఈశ్వరరావు, నీలపాల రామకృష్ణ, మాతా నూకరాజు, మంద జంగం, బొల్లంపల్లి సత్యనారాయణ, బొజ్జపు సత్యనారాయణ, మాతా దుర్గారావు, వెలిశెట్టి హరిప్రసాద్, లక్ష్మణ వెంకటేశ్వరరావు, చక్రవర్తి, జవహర్లచౌదరి, కందుల తాండ కృష్ణ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు

## దయనీయ స్థితిలో విస్సన్నపేట ఇందిరానగర్ వాసులు



విస్సన్నపేట : నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్): విస్సన్నపేట ప్రధాన కేంద్రంలో మండల కార్యాలయానికి అతి సమీప ప్రాంతం ఈ కాలనీ లో సరైన మురుగు కాలువలు గానీ, పారిశుధ్య వ్యవస్థ గానే విద్యుత్ దీపాల పరివేక్షణ గానీ సక్రమంగా లేకపోవటమే కాకుండా వర్షాలు కురిసిన సమయంలో నీరు వెళ్లిపోవటానికి ఎలాంటి కార్యాచరణ లేక అక్కడి గృహవాసులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు, గత ప్రభుత్వం ఈ కాలనీ యొక్క పరివేక్షణతో పట్టించున్న సందర్భం లేదు ఈ కాలనీ నుండి మండలానికి ప్రథమ భూమిక పోషించిన నాయకులు ఉన్నప్పటికీ ఎలాంటి ఎదుగు బొదుగు లేదని ప్రస్తుత ప్రభుత్వం అయినా పట్టించుకోని కనీస మౌలిక వసతులు కల్పిస్తారు అనుకుంటే ఇప్పుడే అదే పరిస్థితి అని అక్కడి ప్రజలు వాపోతున్నారు,=వ్రీ గంగరాజు, విలేకరి కిరణ్ గార్ల ఇంటి రోడ్డు చివర ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా ద్వాంసం కావటంతో రోడ్డు తెగిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారటమే కాకుండా పెద్ద మొత్తంలో వరద రావటంతో పొదల్లో నుండి పెద్ద పెద్ద పాములు సైతం రోడ్డు పై పడుకొని భయభ్రాంతులకు గురించేస్తున్నాయి ప్రత్యక్షంగా తీసిన వీడియోలో ఆ విజివల్స్ కూడా పెట్టటం జరిగింది. ఇప్పటికైనా దీనిపై దృష్టి పెట్టి తగిన రీతిలో రోడ్డును మెరుగు పరచే ఏర్పాట్లు చెయ్యాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తమ గోడు వెళ్ళబుచ్చుతున్నారు

## భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణా జిల్లాలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**–ప్రజలు అత్యవసర సమాచారం కోసం 08672-252399 నంబర్‌కు ఫోన్ చేయాలి**

మచిలీపట్నం, సెప్టెంబరు 23 నేటి శుభోదయ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన డిప్రెషన్ ప్రభావంతో కృష్ణా జిల్లాతో పాటు కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని జిల్లా కలెక్టర్ డి. కె. బాలాజీ అన్నారు. ప్రజలకు తక్షణ సహాయం, సమాచారం అందించేందుకు మచిలీపట్నంలోని జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ డి.కె. బాలాజీ తెలిపారు. భారత వాతావరణ శాఖ నేషనల్ బులెటిన్ నం.3 ప్రకారం, పశ్చిమ మధ్య మరియు దానికి ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన డిప్రెషన్ గత ఆరు గంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ 2026 సెప్టెంబరు 22వ తేదీ ఉదయం 5.30 గంటలకు 17.9డిఎన్ అక్షాంశం, 86.3డీఇ రేఖాంశం వద్ద కేంద్రీకృతమై ఉందని, ఈ డిప్రెషన్ తదుపరి 12 గంటల్లో డీప్ డిప్రెషన్‌గా బలపడే అవకాశం ఉందని, అనంతరం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ విశాఖపట్నం--గోపాలపురం మధ్య ఉత్తర ఆంధ్రప్రదేశ్--దక్షిణ ఒడిశా తీర ప్రాంతాన్ని సెప్టెంబరు 23వ తేదీ రాత్రి నుంచి 24వ తేదీ తెల్లవారుజాము మధ్య డీప్ డిప్రెషన్‌గా దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో సెప్టెంబరు 22 నుంచి 25వ తేదీ వరకు కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 08672-252399 భారీ వర్షాల పరిస్థితికి సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమాచారం,



అత్యవసర పరిస్థితులను స్వీకరించి సంబంధిత అధికారులకు తెలియజేసేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేస్తుందన్నారు. ప్రజలు భారీ వర్షాలు, నీటి నిల్వలు, వరద పరిస్థితులు తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని 08672-252399 నంబర్‌కు తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించే సిబ్బంది, కంట్రోల్ రూమ్ నిరంతరాయంగా పనిచేసేలా సిబ్బందిని షిఫ్ట్‌ల వారీగా నియమించారని తెలిపారు. సెప్టెంబరు 23, ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు:ఎం. రియాజ్, జూనియర్ అసిస్టెంట్ -- 7893429231సెప్టెంబరు 23, మధ్యాహ్నం 2.00 నుంచి రాత్రి 8.00 గంటల వరకు:బి.హెచ్. మనోజ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ -- 8688689815సెప్టెంబరు 23 రాత్రి 8.00 నుంచి సెప్టెంబరు 24 ఉదయం 8.00 గంటల వరకు: కె.వి.వి. విగ్నేష్, జూనియర్ అసిస్టెంట్ -- 9912122004 డీ.వి.ఎస్. నాగమల్లేశ్వరరావు, ఆఫీస్ సబార్డినేట్ -- 9985566127 సెప్టెంబరు 24, ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు: పి. హెప్సీ ప్రహర్షిత, జూనియర్ అసిస్టెంట్ -- 8309581562 సెప్టెంబరు 24, మధ్యాహ్నం 2.00 నుంచి రాత్రి 8.00 గంటల వరకు: పి. శివరామ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ -- 9951575316 సెప్టెంబరు 24 రాత్రి 8.00 నుంచి సెప్టెంబరు 25 ఉదయం 8.00 గంటల వరకు: ఎం. లోకేష్, జూనియర్ అసిస్టెంట్ -- 7036047257 ఎం. దుర్గామస్తాన్, ఆఫీస్ సబార్డినేట్ -- 9441535677 సెప్టెంబరు 25, ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు: పి. జరీనా బేగం, జూనియర్ అసిస్టెంట్ -- 9966059279 సెప్టెంబరు 25, మధ్యాహ్నం 2.00 నుంచి రాత్రి 8.00 గంటల వరకు: బి.హెచ్. మనోజ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ -- 8688689815. ప్రజల నుంచి వచ్చే సమాచారంపై తక్షణ స్పందన కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫోన్ కాల్స్‌లో ప్రజలు తెలియజేసే భారీ వర్షాల పరిస్థితి, సమస్యలు, ఫిర్యాదులను సిబ్బంది నమోదు చేసి, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి కార్యాలయ సూపరింటెండెంట్, కోఆర్డినేషన్ విభాగానికి తెలియజేసి తదుపరి చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదు, సమాచారం వచ్చిన సమయం, వివరాలను నమోదు చేసి, తమ డ్యూటీ ముగిసే సమయంలో తదుపరి షిఫ్ట్ సిబ్బందికి అప్పగించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో విధుల నుంచి తప్పుకోవాల్సి వస్తే కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జికి ముందుగా సమాచారం అందించి ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం నుంచి వచ్చే సూచనలను పాటించాలని జిల్లా కలెక్టర్,జిల్లా మేజిస్ట్రేట్ డి.కె. బాలాజీ సూచించారు.

## రేపు ఒంగోలులో ఆర్ఎంపి వైద్యుల రాష్ట్ర మహాసభ.

గుడివాడ, సెప్టెంబర్ 23 నేటి శుభోదయ: ఈనెల 25వ తేదీ శుక్రవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆర్ఎంపి వైద్యుల రాష్ట్ర మహాసభ జరుగుతుందని రూరల్ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాగిరాజు ఉదయ భాస్కరరాజు, దాసు వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఒంగోలులోని బృందావనం కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ,అలాగే ఆర్ఎంపీ ఫెడరేషన్ కు సంబంధించి లంక దాసరి ప్రసాదరావు, యామర్తి నాగేశ్వరరావు, కరెళ్ళ గణపతిరావు, కోలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## నిరంతరం ప్రజల చెంతకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..

**– రాజానగరం కార్యాలయంలో అర్జీల స్వీకరణ, తక్షణ పరిష్కారాలు..!!**




కోరుకొండ, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాజానగరంలోని ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే బలరామకృష్ణ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10 గంటల నుండి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజలు తమకు ఎదురవుతున్న పలు రకాల సమస్యలపై, వ్యక్తిగత మరియు సామాజిక అవసరాలపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకి స్వయంగా అర్జీలను సమర్పించారు. రైతు సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు వంటి పలు విషయాలపై ప్రజలు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. వచ్చిన ప్రతి ఒక్క అర్జీని ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులతో మాట్లాడి వారి సమస్యల తీవ్రతను తెలుసుకున్నారు. అర్జీల స్వీకరణ అనంతరం ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. పలు సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. బుచెంపేట, గుమ్ములూరు, మిర్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాల రైతులకు త్రాగునీరు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన తక్షణమే స్పందించి అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ నెల 25 న జరిగే నేషనల్ డీ వార్మింగ్ డే కార్యక్రమం సందర్భంగా డాక్టర్ల సమక్షంలో పోస్టర్ ఆవిష్కరించారు..తమ సమస్యలను ఓపికగా విని, అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చొరవ పట్ల నియోజకవర్గ ప్రజలు మరియు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడు దొరకడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## భద్రాద్రి కా మహారాజ్ గణపయ్యను దర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



భద్రాచలం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం పట్టణంలోని డాక్టర్ ఆర్ నాగేశ్వరరావు విధి లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భద్రాద్రి కా మహారాజ్ గణపతి ని బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో నవరాత్రులు నిర్వహిస్తున్న వారిని అభినందించారు. నిర్వాహకులు కుప్పాల నాగరాజు, కుప్పాల వంశీ తేజ, శ్రీమంతుల బాల సూర్య ల తో పాటు కమిటీ సభ్యుల కృషిని మంత్రి ప్రశంసించారు. నవరాత్రి లే కాకుండా కార్తీకమాసంలో ఘనంగా నిర్వహిస్తున్న అయ్యప్ప 18 మెట్ల పడిపూజ కార్యక్రమాలు, ముక్కోటి ఉత్సవాల్లో అధికారులకు సహకారాలు అందించడం నిజంగా అభినందించాల్సిన విషయం అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు పాల్గొన్నారు.

## ఖమ్మంలో కవిరాజ్ నగర్ లో హరివిల్లు అపార్ట్మెంట్లో ఘనంగా శ్రీ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: హరివిల్లు అపార్ట్మెంట్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విశేష వేలంపాట విజేతలను ప్రకటించారు. హుండీ: రూ 59,000/- చీరాల జగన్ - త్రిపుర దంపతులు. లడ్డూ ప్రసాదం: రూ 21,500/- జొన్నలగడ్డ వెంకట బ్రహ్మం - కృష్ణకుమారి దంపతులు. దోవతి కండువా: రూ 7,100/- శంకర్ (సి ఐ) - స్వాతి దంపతులు. కలశం: రూ 6,800/- సింగిరికొండ రాంబాబు - కవిత లక్ష్మి దంపతులు. ఛత్రి (గొడుగు): రూ 6100 కండిబడ్ల జగన్నాథరావు - అమృతవల్లి దంపతులు. భక్తి శ్రద్ధలతో వేలంపాటలో పాల్గొని విజయవంతం చేసిన విజేతలందరికీ హరివిల్లు అపార్ట్ మెంట్ గణేష్ ఉత్సవ కమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు మీ కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని కోరారు. మధ్యాహ్నం నుండి గణేష్ నిమజ్జనానికి అపార్ట్మెంట్ వాసులందరూకలిసి వెళ్లి నిమజ్జనం చేశారు. ఇది ఇలా ఉండగా ఖమ్మం నగరంలో వినాయకుని నిమజ్జనానికి తీసుకువెళ్లన చిన్నారి బాలుడు.

## 'సెప్టెంబర్ 27న రాజమహేంద్రవరంలో అంగరంగ వైభవంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు..'

**– రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**

**– సచివాలయంలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో మంత్రి దుర్గేష్ కీలక సమీక్ష..**

**– గోదావరి పుష్కరాలు, ఇన్-బౌండ్ టూరిజం వృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ..**

**– రాష్ట్రానికి ఇన్-బౌండ్ టూరిస్టులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రచారాలు, రోడ్ షోలు నిర్వహించాలని సూచన..**



రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను పర్యాటక, సాంస్కృతిక కేంద్రమైన రాజమహేంద్రవరంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని తన ఛాంబర్ లో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్, టూరిజం ఎండీ పట్టాన్ శెట్టి రవి సుభాష్ లతో మంత్రి దుర్గేష్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సాంస్కృతిక రాజధానిగా విరాజిల్లుతున్న రాజమహేంద్రవరంలో పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేయాలన్నారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పర్యాటక శాఖ తరపున చేపట్టాల్సిన ఏర్పాట్లు, టెంట్ సిటీలు, హోమ్ స్టేలు తదితర భక్తులకు మెరుగైన వసతుల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రానికి ఇన్-బౌండ్ టూరిస్టుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు సరికొత్త ప్యాకేజీలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల సౌందర్యాన్ని తెలిసేలా దేశంలోని ప్రధాన నగరాలతో పాటు విదేశాల్లోనూ రోడ్ షోలు నిర్వహించాలన్నారు. ఏడాదంతా నిరంతరం పర్యాటక శోభ ఉట్టిపడేలా వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలు జరపాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధులు, వాటితో జరుగుతున్న పనుల ప్రగతిని మంత్రి దుర్గేష్ సమీక్షించారు. త్వరలోనే మరిన్ని పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) కేంద్రానికి సమర్పించి, అదనపు నిధులు రాబట్టేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## కనకం ఉపేందర్‌ను పరామర్శించిన బానోతు మనిషా లక్ష్మి

**– చింతలపాడులో కనకం ఉపేందర్**

**యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు**



ఖమ్మం, వైరా, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :::సింగరేణి మండలం మోట్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చింతలపాడు గ్రామానికి చెందిన కనకం ఉపేందర్‌ను బీఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోతు మనిషా లక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ఉపేందర్ యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని అండగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ శాఖల పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలి

**– జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 23 నేటి శుభోదయ : ఆయా ఇంజనీరింగ్ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టి సకాలంలో గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఆర్.అండ్.బి, పంచాయతీ రాజ్, ఆర్.డబ్ల్యు.ఎస్, ఇతర ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఇంజనీరింగ్ సెక్టార్ పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అన్ని రకాల ఇంజనీరింగ్ పనులు ఏ దశలో ఉన్నాయి, ఎంత పని పూర్తి అయ్యింది ఆరా తీసి, ఆయా పనులను వేగవంతంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయలని ఆదేశించారు. ఆర్.అండ్.బి పరిధిలో చేపట్టిన రహదారులు, బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సాస్కి, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన -3, నాబార్డు కింద కింద చేపట్టిన పనులను కేటాయించిన లక్ష్యం మేరకు గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఎంపీ నిధుల కింద మంజూరైన పనులలో పురోగతి చూపించకపోతే పీఆర్ ఈఈపై చార్జెస్ ఫ్రేమ్ చేస్తామన్నారు. ఆర్డబ్ల్యూఎస్ పరిధిలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌లో మంజూరైన అన్ని కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సెస్ యూనిట్లను ఈనెల ఆఖరి నాటికి పూర్తి చేయాలని, దేవాలయాలలో పురోగతిలో ఉన్న పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని టాయిలెట్లు మరియు తాగునీటి సౌకర్యాల పనులను ఈనెల 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా ప్రారంభంకాని ఎంపీ నిధుల పనులన్నింటినీ వచ్చే వారంలోగా ప్రారంభించాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ఎఫ్ హెచ్ టి సి లక్ష్యమైన 20,633 కనెక్షన్ల పనులను వచ్చే మార్చి నెల నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపిఎస్ఎంఐడిసి, హెచ్ఎన్ఎస్ఎస్, ఏపిఈడబ్ల్యుఐడిసి, హెచ్ఎల్సి, ఇతర ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. టైం లైన్ ప్రకారం అన్ని పనులను ఆయా శాఖల అధికారులు పూర్తి చేయడంపై క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, పిఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, సీపీఓ బాలాజీ నాయక్, మైన్స్ ఎడి ఆదినారాయణ, హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఆయా ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## గణనాథుడి సన్నిధిలో ఎస్సై ప్రత్యేక పూజలు



ఖమ్మం, వైరా, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: వైరా మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద వైరా ఎస్సై పుష్పాల రామారావు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం రెండో వార్డు కౌన్సిలర్ తిరుపతి శివకుమారి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్సై పుష్పాల రామారావును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ గణేష్ నిమజ్జన వేడుకలను వైరాలో ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించిన ప్రజలకు అభినందనలు తెలిపారు. ఇదే విధంగా భవిష్యత్తులోనూ ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వార్డు ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## నేడు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను సందర్శించనున్న మాజీ మంత్రి పువ్వాడ



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: తెలంగాణ థర్మల్ పవర్ స్టేషన్లలో జరుగుతున్న పరిణామాలపై నిజానిజాలు తేల్చేందుకు బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏర్పాటు చేసిన ఆరు బృందాలు గురువారం వివిధ పవర్ స్టేషన్లను సందర్శించనున్నాయి. ఇందులో భాగంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నేతృత్వంలోని బృందం మణుగూరు లోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను గురువారం ఉదయం సందర్శించనున్నారు. పవర్ స్టేషన్‌లోని పరిస్థితులను పరిశీలించి, వాస్తవాలను తెలుసుకోనున్నారు.

## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న డాక్టర్ మల్లాది ప్రసాదరావు



యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూర్: నేటి శుభోదయ : తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ పట్టణంలోని పి.ఎస్. ఫంక్షన్ హాల్లో భారత్ రక్తదాన్ సేవా మిషన్ కే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన రక్తదాతలు, సామాజిక సేవకులు అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 320 సార్లు రక్తదానం చేసిన సంపత్ కుమార్ పాల్గొన్నారు. భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కురిమేటి నవీన్ చేతుల మీదుగా ప్రముఖ జర్నలిస్ట్ మరియు మదర్ సర్వీస్ సొసైటీ సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ మల్లాది ప్రసాదరావుకు ఉత్తమ సేవా పురస్కారం--2026 అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లాది ప్రసాదరావు మాట్లాడుతూ, మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా దాతల సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉచిత మెడికల్ వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు, నిరాశ్రయులైన వృద్ధులు, వితంతువులకు వస్త్రదానం, వృద్ధాశ్రమాల్లో అన్నదానం వంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా కోవిడ్ లాంటి విపత్కరమైన పరిస్థితుల్లో మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసి ప్రజలకు రక్షణ కల్పించామని తెలిపారు. సమాజంలో నిస్వార్థంగా, స్వచ్ఛందంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సేవకులు, సామాజిక కార్యకర్తలను ప్రోత్సహిస్తూ మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారుగా 800 మందికి పైగా అవార్డులు ప్రధానం చేసినట్లు వెల్లడించారు. అనేక సేవా కార్యక్రమాలతో పాటు నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం, నిరుపేద కుటుంబాలకు ఆపన్నహస్తం అందించడం వంటి పలు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని డాక్టర్ మల్లాది ప్రసాదరావు పేర్కొన్నారు. ప్రజలకు, నిరుపేదలకు, అవసరంలో ఉన్న వారికి అందిస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ సేవా పురస్కారంతో సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. సేవా కార్యక్రమాలకు గుర్తింపు లభించడం మరింత సేవాస్ఫూర్తితో ముందుకు సాగేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డాక్టర్ మల్లాది ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క ప్రాణం కూడా రక్తం అందక కోల్పోకుండా యువత ముందుకు వచ్చి రక్తదాతలుగా మారాలని, అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు. సమాజ సేవ అనేది కేవలం కార్యక్రమాలకు పరిమితం కాకుండా, అవసరంలో ఉన్న సమయంలో ఒక మనిషికి మరో మనిషి అండగా నిలవడమే నిజమైన సేవ అని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా మరింత సేవాస్ఫూర్తితో ప్రజలకు, నిరుపేదలకు, అవసరంలో ఉన్న వారికి తన సేవలను కొనసాగిస్తానని డాక్టర్ మల్లాది ప్రసాదరావు తెలిపారు. అవార్డుతుకున్న సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థలు,జర్నలిస్టులు, పలువురు ప్రముఖులు తదితరులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## శ్రీ స్తంభాద్రి ఖమ్మం నగర స్వర్ణకార సంఘం లడ్డు లక్కీడ్రా



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: వినాయక చవితి సందర్భంగా స్వర్ణ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో నవరాత్రులు విశేషంగా పూజలు అందుకున్నారు. 33 కేజీల లడ్డు లక్కీ డ్రా లో విజేతగా నిలిచిన డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లడ్డు లక్కీ డ్రా లో విజేతగా నిలవడం నాకు ఎంతో ఆనందంగా గర్వంగా ఉంది. ఈ లక్కీ డ్రా ఎంతో చక్కగా నిర్వహించిన కమిటీ సభ్యులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ అందరి సహకారం ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ విజయాన్ని అందరితో పంచుకోవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. గెలుపొందిన లడ్డును మేళ తాళాలతో నా ఇంటి వద్దకు పంపించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్టీసీ డిపో వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పుడా పార్కును అందంగా తీర్చిదిద్దాలి

**పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం తోపాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఆర్డీఓ సువర్ణ తో కలిసి స్థలాలను పరిశీలించిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 23 నేటి శుభోదయ, : పుట్టపర్తి పట్టణాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేలా అధికారులు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సూచించారు.

పుట్టపర్తి పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పుడా పార్కులను పరిశీలించిన ఆయన, పార్కులను అందంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పార్కుల్లో పచ్చదనం పెంపొందించడంతో పాటు మొక్కలు, పూల మొక్కలు, వాకింగ్ ట్రాక్‌లు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. అనంతరం పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంతో పాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అనువైన స్థలాలను ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ అధికారులతో కలిసి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరిశీలించారు. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందేలా ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించి, అవసరమైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.

పుట్టపర్తి పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు రెవిన్యూ అధికారులు, టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ,జనసేన సివిల్ సప్లై కమిషన్ సభ్యులు అబ్దుల్లా ,టీడీపీ కన్వీనర్ బోయ రామాంజనేయులు,టీడీపీ నాయకులు ఓబులేసు ,రామారావు, లక్ష్మీపతి గంగాధర్ నాయుడు,శ్రీరామ్ రెడ్డి ,వెంకటరెడ్డి ,కృష్ణప్రసాద్ ,సురేష్ చౌదరి , మున్సిపల్ అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ పదవీకాలం ముగిసినా ప్రజాసేవకు విరామం లేదు

**ప్రజల నమ్మకమే నా ఐదేళ్ల పదవీకాలానికి అసలైన బలం: ఒమ్మి బిందుమాధవి రఘురామ్**



కాకినాడ జిల్లా,జగ్గంపేట సెప్టెంబర్ 23 నేటి శోదయ : జగ్గంపేట జడ్పీటీసీగా ఐదేళ్లపాటు ప్రజలకు సేవలందించిన లిఒమ్మి బిందుమాధవి రఘురామ్ దంపతులనులి బుధవారం తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా పరిషత్ సాధారణ ఆత్మీయ సమావేశంలో ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ చైర్మన్ లిశ్రీ విప్పర్తి వేణుగోపాల్‌లి మరియు జిల్లా పరిషత్ సీఈఓ చేతుల మీదుగా ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఒమ్మి బిందుమాధవి రఘురామ్ మాట్లాడుతూ, "ప్రజలు నాపై నమ్మకం పెట్టుకుని జడ్పీటీసీగా గెలిపించిన రోజు నుంచి, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా ప్రధాన లక్ష్యంగా పనిచేశాను. ఐదేళ్ల పదవీకాలంలో ప్రజలకు ఎలా ఉపయోగపడాలి? వారి సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే ఆలోచన తప్ప నాకు మరో ఎజెండా లేదు" అని అన్నారు. జగ్గంపేట మండలంలోని ప్రజా అవసరాలు, సమస్యలను జిల్లా పరిషత్ సమావేశాల్లోనూ, జగ్గంపేట మండల పరిషత్ సమావేశాల్లోనూ పదేపదే ప్రస్తావించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అనేక సమస్యలకు పరిష్కారం చూపినట్లు తెలిపారు. "ప్రతి సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజల తరఫున మాట్లాడటం నా బాధ్యతగా భావించాను. నేను చేసిన పనుల్లో నాకు లభించిన గొప్ప గుర్తింపు పదవి కాదు... ప్రజల నమ్మకం. జడ్పీలో ఎక్కువ ప్రజా సమస్యలను ప్రస్తావించిన జడ్పీటీసీగా నాకు వచ్చిన గుర్తింపు నాకు ఎంతో సంతృప్తినిచ్చింది" అని బిందుమాధవి అన్నారు. తనకు రాజకీయాలు కొత్త అయినప్పటికీ, తన భర్త లిఒమ్మి రఘురామ్‌లి ఇచ్చిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, సహకారం వల్ల ప్రజలకు మరింత చేరువగా పనిచేయగలిగానని ఆమె తెలిపారు. "నాకు రాజకీయ అనుభవం తక్కువైనా, నా భర్త రఘురామ్ నన్ను నిరంతరం ప్రోత్సహించారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వాటిని సంబంధిత వేదికలపై ప్రస్తావించడం, పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం నేర్పించారు. నాకు మంచి జడ్పీటీసీగా పేరు రావడంలో ఆయన సహకారం ఎంతో ఉంది"అని పేర్కొన్నారు. తన మామగారు లిస్వర్గీయ ఒమ్మి నూకరాజులి గారి ఆశయం జడ్పీటీసీ కావడమేనని, అయితే ఆయన జడ్పీటీసీ ఫలితాలు వెలువడకముందే కరోనా సమయంలో మృతి చెందడం తనకు జీవితాంతం బాధగా మిగిలిపోయిందని బిందుమాధవి భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. "మామగారి కలను నెరవేర్చే అవకాశం నాకు రావడం ఒక బాధ్యతగా భావించాను. ఆయన ఆశయాన్ని గుర్తుచేసుకుంటూ ప్రజల పక్షాన నిలబడి పనిచేశాను. జగ్గంపేట స్మశాన వాటిక అభివృద్ధి, మండలంలో జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నా పదవీకాలంలో నాకు ఎంతో సంతృప్తినిచ్చాయి" అని తెలిపారు. ఇంకా పరిష్కరించాల్సిన అనేక ప్రజా సమస్యలు ఉన్నాయని, జడ్పీటీసీ పదవి ముగిసినా వాటిపై తన పోరాటం ఆగదని ఆమె స్పష్టం చేశారు. "పదవికి మాత్రమే గడువు ఉంటుంది... ప్రజాసేవకు గడువు ఉండదు. జడ్పీటీసీగా నా బాధ్యత ముగిసినా, ప్రజల పట్ల నా బాధ్యత ఎప్పటికీ ముగియదు. ఇకపై కూడా పదవి లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నా భర్త రఘురామ్ సహకారంతో నా వంతు కృషి చేస్తాను" అని బిందుమాధవి అన్నారు. జడ్పీటీసీ గా అవకాశం కల్పించిన వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అప్పటి ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వై యస్ జగన్మోహన్ రెడ్డి గారికి, తన ఐదేళ్ల పదవీకాలంలో సహకరించిన జిల్లా పరిషత్ చైర్మన్, సీఈఓ, అధికారులు, మండల పరిషత్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, జగ్గంపేట మండల ప్రజలు, తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "ప్రజలు నాకు ఇచ్చిన ఐదేళ్ల అవకాశం ఒక పదవి మాత్రమే కాదు... అది ఒక బాధ్యత. ఆ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించాననే సంతృప్తితో ఈ పదవీకాలానికి వీడ్కోలు పలుకుతున్నాను. ప్రజల కోసం ప్రారంభించిన సేవా ప్రయాణం మాత్రం ఇక్కడితో ఆగదు. ప్రజల సమస్య ఉన్నచోట, ప్రజల పిలుపు ఉన్నచోట నేను ఎల్లప్పుడూ ఉంటాను" అని ఒమ్మి బిందుమాధవి రఘురామ్ అన్నారు. సన్మానం అందుకున్న రఘురామ్ దంపతులను పలువురు అభినందించారు.

## వరద పరిస్థితులపై పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**– వరద పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ**

**– 24 గంటల పాటు అందుబాటులో కంట్రోల్ రూమ్**

**– అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి**

**– టోల్‌ఫ్రీ నంబర్: 1077, సెల్ నంబర్ 9063211298**

ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలోని వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు తదితర ప్రాంతాల్లో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, పరిస్థితిని బట్టి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్న వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, నదులను దాటేందుకు ప్రజలు ప్రయత్నించ రాదని కలెక్టర్ సూచించారు. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, నీట మునిగిన ప్రాంతాలు తదితర ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో రాకపోకలను పర్యవేక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు వరదలకు సంబంధించిన ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. కంట్రోల్ రూమ్‌కు అందిన సమాచారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్: 1077, కంట్రోల్ రూమ్ సెల్ నంబర్: 9063211298 ప్రజలు ఈ నంబర్లను వినియోగించుకొని వరద పరిస్థితులు, అత్యవసర సమస్యలపై సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వర్షంలో తడుస్తూ, వెలుగు నిలిపిన హీరో నేలకొండపల్లి విద్యుత్ శాఖ అధికారి జి. రవి కి సలామ్



ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: వినాయక నిమజ్జనం అంటే భక్తి, డప్పుల సందడి, లైటింగ్ వెలుగులు. ఆ వెలుగుల వెనుక కంటికి కనిపించని కష్టం ఉంటుంది. ఆ కష్టాన్ని భుజాన వేసుకుని వర్షంలోనూ తడుస్తూ విధులు నిర్వహించిన వ్యక్తే విద్యుత్ శాఖ అధికారి జి. రవి. బుధవారం నిమజ్జనం రోజున ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. నిమజ్జన ఘాట్ వద్ద కరెంటు తీగల మీద చెట్లు పడి, పలుచోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. జనం భయపడుతున్న సమయంలో రెయిన్ కోట్ కూడా లేకుండా తన సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు రవి. వర్షంలో తడుస్తూనే లైన్లు చెక్ చేయడం, తడిసిన వైర్లను సరి చేయడం, నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించడం, అన్నీ స్వయంగా పర్యవేక్షించారు."మా పండగ ఆగకూడదు, ఒక్క చిన్న షాక్ కూడా తగలకూడదు" అనే లక్ష్యంతో ఆయన పడిన శ్రమను చూసి స్థానికులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఫిదా అయ్యారు. "అధికారులు అంటే ఏసీ రూంలో కూర్చునేవారు కాదు. వర్షంలో ప్రజల మధ్య ఉండేవారే నిజమైన హీరోలు" అని పలువురు ప్రశంసిస్తున్నారు. విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచిన జి. రవి కి, ఆయన సిబ్బందికి నేలకొండపల్లి ప్రజల తరపున హ్యాట్సాఫ్ చెప్పారు మరి.

## పర్యాటక ప్రాంతాలు మూసివేత



చింతూరు, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: తుఫాను కారణంగా భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయని, కొండ చరియలు విరిగిపడవచ్చునని అందువల్ల చింతూరు పోలీస్ సర్కిల్లోని మోతుగూడెం, పోల్లూరు, ఫోర్ బే క్యాంపు, వాటర్ ఫాల్స్, డొంకరాయి తదితర పర్యాటక ప్రాంతా లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రజలు ఇళ్లల్లోనే నివసించాలని వర్షాలకు బయటకు రాకూడదని, ప్రమాదకరమైన వాగులు వంకలు దాటకూడదని పేర్కొన్నారు. ఈ తుఫాను తగ్గే వరకు చింతూరు పోలీస్ సర్కిల్లో ని పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులు ఎవరు రాకూడదని తెలిపారు.

నేటి శుభోదయ

గురువారం - 24 - సెప్టెంబర్ - 2026

## ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ కు మీడియా ప్రతినిధులు సన్మానం



చింతూరు, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని, బుధవారం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్ ను ఎపిడబ్ల్యూజెఎఫ్, ఎపిబిజెఎ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యూజెఎఫ్ చింతూరు డివిజన్ అధ్యక్ష, కార్యాదర్శులు వల్లాల సత్యనారాయణ (ఎబిఎన్), ఎస్.కె ఇబ్రహీం (వార్త) మాట్లాడారు. జమాల్ ఖాన్ కుటుంబం తరతరాలుగా పరంపర ఆయుర్వేద వైద్యాన్ని నిర్వహిస్తూ ఎందరికో ప్రాణదానం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ ఘడ్, ఒడిశా రాష్ట్రాల్లో ఆయుర్వేద వైద్యం నిర్వహిస్తూ, దేశ వ్యాప్తంగా ఆయుర్వేద వైద్యానికి పేరు ప్రక్షాతలు తెచ్చిన ఘనుడు జమాల్ ఖాన్ అని కొనియాడారు. సన్మాన గ్రహీత జమాల్ ఖాన్ మాట్లాడారు. ఆయుర్వేద వైద్యం వెలకట్టలేనిదన్నారు. ఆయుర్వేద వైద్యంతో తమ కుటుంబానికి ఉన్న సంబంధాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2016 సెప్టెంబర్ 23 న ఆయుర్వేద దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు సత్యం (మనం), ఎస్.కె. మస్తాన్ జాని (వార్త), కొండయ్య (ప్రజాశక్తి), బొగ్గా ప్రసాద్ (సూర్య) తదితరులు పాల్గొన్నారు.

## చర్చలు విఫలం, 5 రోజులు బ్యాంకులు బంద్

**– దేశవ్యాప్త సమ్మెకు బ్యాంకు సంఘాల పిలుపు**

**సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె**

**– శని, ఆదివారాలతో కలిపి మొత్తం ఐదు రోజులు బ్యాంకులు బంద్**

**– వారానికి 5 రోజుల పని ప్రధాన డిమాండ్ అన్న యూనియన్లు**

**– లావాదేవీలు ముందుగానే పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచన**

ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంతరాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఫలితంగా సెప్టెంబర్ చివరి వారంలో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంతకాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు మంగళవారం డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, స్పష్టమైన హామీ యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు బంద్ ప్రకటించారు. ఆ తర్వాత శని, ఆదివారాలతో కలిపి వరుసగా ఐదు రోజులు బ్యాంకు మూసి ఉండనుంది.

### బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో

## వినాయకుని నిమజ్జన కార్యక్రమం

**తొమ్మిది రోజుల పూజల అనంతరంఅంగరంగా జరిగిన వినాయకుని నిమజ్జన ఊరేగింపు**

**బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన సంతర్పణ**



కాకినాడ జిల్లా, జగ్గంపేట సెప్టెంబర్ 23 నేటి శుభోదయ : గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ వినాయక స్వామివారి విగ్రహానికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బుధవారం నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగగా, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భజనలు, వాయిద్య ప్రదర్శనలు నిర్వహించగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. అనంతరం వినాయక స్వామివారి విగ్రహాన్ని నిర్ణయించిన నిమజ్జన ప్రదేశంలో భక్తులు నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణకు బాల గణేష్ యూత్ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా బాల గణేష్ యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, సోమవారం మల్లేపల్లి గ్రామంలోని రామాలయం వీధిలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## హరిణి హత్య కేసు నిందితులను శిక్షించాలి

**– బాధిత కుటుంబానికి అండగా ఉంటాం**

**– నిందుతులపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలి**

**– తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు**



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన హరిణి ఖమ్మంలో నర్సింగ్ చదువుతూ ఇటీవల లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగులోని బంధువుల ఇంటికి వచ్చి వెళ్లిన మరుసటి రోజే దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలిసిన వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఆయన, మృతదేహాన్ని పరిశీలించి కన్నీరుమున్నీరవుతున్న బాధిత కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు ఉన్న ఓ విద్యార్థిని ఇలా దారుణంగా హత్యకు గురికావడం అత్యంత బాధాకరమన్నారు. సమాజంలో మహిళలకు రక్షణ కరువవుతున్న ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి నిఘా ఉంచి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. హరిణి కుటుంబానికి తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ఓదార్పు ఇచ్చారు.**

# బీఆర్ఎస్ ది దోపిడీ పాలన, కాంగ్రెస్ ది సంక్షేమ పాలన

**– వైఎస్సార్ హయాంలో శంకుస్థాపన చేసిన వాటికి కూడా ప్రాజెక్టుల పేర్లు, రీ డిజైన్ల మార్పుతో రూ. వేలాది కోట్లు దండుకున్నారు**

**– అహంకార వైఖరితోనే దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు**

**– కుల మతాలకతీతంగా ప్రజా సంక్షేమ పాలనే మా లక్ష్యం**

**– మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**– పులుసుబొంత ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని వెల్లడి**




ఖమ్మం, అశ్వాపురం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులను రీ డిజైన్ ల పేర్లతో నిర్లక్ష్యం చేసి రూ.వేలాది కోట్ల తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రసంగించారు.

**మండలంలోని 23 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం**

ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ద్వారా తుమ్మల చెరువు నుంచి 4,300 ఎకరాలకు సాగునీరు అందుతుందని, భవిష్యత్తులో అశ్వాపురం మండలంలోని అన్ని ప్రాంతాల పరిధిలో 23 వేల ఎకరాలకు సాగునీరు అందేలా కృషి చేస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి మేరకు అనేక ఏళ్లుగా పెండింగ్లో ఉన్న పులుసు బొంత ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని, అవసరమైన భూసేకరణ, అటవీ క్లియరెన్స్ ను ఆచరణలోకి తెస్తామని అన్నారు.

**- వైఎస్సార్ హయాంలో శంకుస్థాపనలు చేస్తే,**

గత పాలకుల స్వలాభం కోసం రీ డిజైన్లు దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్సార్ హయాంలో ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తే బీఆర్ఎస్ పాలకులు రీ డిజైన్ల పేరుతో వేల కోట్లాది రూపాయలను దండుకునేందుకు సీతారామ ప్రాజెక్టు ను వారి స్వలాభాలకు ఎలా మార్చుకున్నారో అందరికీ తెలిసిన విషయమేనని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక మారేళ్లపాడు ప్రాజెక్టు పూర్తి చేశామని, భవిష్యత్తులో అనేక సాగునీటి ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు.

**- మాది చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వం**

పదేళ్లు రేషన్ కార్డు ఊసే ఎత్తకుండా పాలించారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చామని, రూ.72 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించామని తెలిపారు.కులమతాలకతీతంగా తమ పాలన సాగుతుండగా బీఆర్ఎస్ వారేమో అసెంబ్లీ దళిత స్పీకర్ తల్లి పట్ల అహంకారపూరిత భాషతో మాట్లాడుతుండటం బాధాకరమని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను 3, 4 విడతల్లో కూడా అందజేస్తామని, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చూస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## తెలుగు ఖ్యాతిని అమెరికా గడ్డపై నిలిపిన మంత్రి ప్రగడకు హాట్స్ ఆఫ్

**– సీనియర్ జర్నలిస్ట్ మంత్రిప్రగడ శ్రీనివాసరావు కథనాలు, రచనలు సామాజిక స్పృహను స్పృశింప చేస్తాయి**

**– కవి, రచయిత శ్రీనివాసరావుకు ఐ ఎం ఏ అధ్యక్షురాలు డాక్టర్ రెహానా బేగం, వైద్యులు డాక్టర్ గిరిసింహారావు, డాక్టర్ గ్రీష్మ, డాక్టర్ కాట్రగడ్డ యమున ల సత్కారం**



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: సీనియర్ జర్నలిస్టు, కవి, రచయిత మంత్రి ప్రగడ శ్రీనివాసరావు రచనలు సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో ఆలోచనను రేకెత్తిస్తున్నాయని, నేటి వైద్య ప్రపంచంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వారి కవితలు రచనలు కూడా అవసరమేరని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ రెహనా బేగం, ప్రముఖ మధుమేహ వ్యాధి నియంత్రణ నిపుణులు డాక్టర్ గిరిసింహారావు, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ గ్రీష్మ, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ కాట్రగడ్డ యమున లు అన్నారు. ఇటీవల అమెరికాలో తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి అక్కడ అవార్డులు రివార్డులు పొందిన వార్త కథనాలను, ఖమ్మం జిల్లా కేంద్రంలో ఖమ్మం ప్రెస్క్లబ్లో ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సత్కార మహోత్సవ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని తాము వారిని సన్మానించేందుకు సీనియర్ జర్నలిస్టు జానీ పాషా ద్వారా ఆహ్వానించామని వారన్నారు. తెలుగు భాషపై మక్కువ, సామాజిక అంశాలపై అవగాహన, నిరంతర కృషి శ్రీనివాసరావు రచనలకు ప్రత్యేకతను తీసుకొచ్చాయని వారన్నారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో ఆయన రాసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కథనాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాయని వారు గుర్తుచేశారు. అమెరికాలోనూ తెలుగు భాష, సంస్కృతి విశిష్టతను చాటిన శ్రీనివాసరావు ఖమ్మం జిల్లాకు చెందినవారు కావడం గర్వ కారణమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం పట్ల, గర్భిణీ స్త్రీలు పల్మనాలజీ విభాగ ప్రజలు, థైరాయిడ్ బిపి మధుమేహ వ్యాధి గ్రస్త ప్రజల కు అవగాహన కల్పించేందుకు మంత్రి ప్రగడ శ్రీనివాసరావు రచనలు ఎంత గానో దోహద పడతాయని వారు ఆశా భావం వ్యక్తం చేశారు ఆయన అనుభవం, రచనా ప్రతిభ అటు జర్నలిస్ట్ సమాజానికి, వైద్య విభాగ ప్రపంచానికి ఉపయోగపడాలని వారు ఆకాంక్షించారు.ఆయన కవితలు యువ జర్నలిస్టులకు స్ఫూర్తి నిచ్చేలా ఉన్నాయని వారన్నారు.. అనంతరం వారు సీనియర్ జర్నలిస్టు, కవి , రచయిత మంత్రి ప్రగడ శ్రీనివాసరావు ను శాలువాతో పుష్ప గుచ్చాలతో బహూకరించి ఘనంగా సత్కరించారు.అనంతరం సత్కారానికి స్పందించిన మంత్రి ప్రగడ శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికాలో అవార్డు పొందడం కంటే ఆత్మీయ వైద్యుల మధ్య సత్కారం పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందని వైద్యులు అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా గుర్తుచేశారు. భవిష్యత్తులో జర్నలిస్టుల హక్కులు, వైద్య సేవలపట్ల ప్రజలకు అవగాహన కల్పించే రచనలు కవితలకు తన ప్రాధాన్యత ఉంటుందన్నారు.



## సెంట్రల్ లైటింగ్ నిర్వహణపై నిర్లక్ష్యం వీడండి

**– రోడ్లపై అంధకారం అలుముకుంటున్నా స్పందించరా..**

**– నిర్లక్ష్యం వీడి మరమ్మతులు చేపట్టాలి**

**– సమీక్షా సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని**



ఖమ్మం, కొత్తగూడెం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారులలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని పలు రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ నిర్వహణ, ప్రస్తుత పరిస్థితిపై బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల డివైడర్లపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు వెలగకపోవడంతో రాత్రివేళల్లో రోడ్లన్నీ అంధకారంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చీకటి కారణంగా వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశమున్నా అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిని సహించేది లేదని హెచ్చరించారు. ఎక్కడెక్కడ లైట్లు వెలగడం లేదో గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి రహదారులపై వెలుగులు నింపాలని, నిర్దేశిత గడువులోగా సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ, మండల ప్రజాపరిషత్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. సమీక్షా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, డీపీవో అనూష, ఎంపిడివోలు సుభాషిణి, సుస్మిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'మహిమ ఫస్ట్ ఎయిడ్ సెంటర్' ప్రారంభించిన తూర్పుగోదావరి జిల్లా పి.ఎం.పి కోశాధికారి డా.పి.చిన్ని..



కోరుకొండ, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండకు వెళ్లే రోడ్డులో ఎలకల దిబ్బ దగ్గర గోకవరం మండలం శాఖ పిఎంపి అసోసియేషన్ సభ్యురాలు ఎన్. జ్యోతి నూతనంగా తన 'మహిమ ఫస్ట్ ఎయిడ్ సెంటర్' ను నెలకొల్పారు. ఈ సెంటర్ను తూర్పుగోదావరి జిల్లా పి.ఎం.పి కోశాధికారి మరియు గోకవరం శాఖ మండల అధ్యక్షులు పి .చిన్ని చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ.. అధినేత జ్యోతి అందరికి అందుబాటులో సేవలు అందించాలని, ప్రజలకు మరింత చేరువగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మండల అధ్యక్షులు పి. చిన్ని ని మహిమ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అధినేత ఎన్. జ్యోతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో మండల శాఖ కోశాధికారి గున్నూరు లాజర్, వైస్ ప్రెసిడెంట్ ములపర్తి నాగేశ్వరావు, గుల్లింకలనాని, సహాయ కార్యదర్శి గంటి వెంకటేష్, అసోసియేషన్ సభ్యులు గాదేలపాలెం కిరణ్, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ద

## గోపాలపురంలో ఘనంగా గణేశుని నిమజ్జనం

**– భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం, పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు**



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :::ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ గోపాలపురంలో దేవబత్తిని కిషోర్ బాబు గృహంలో ఏర్పాటు చేసిన వినాయకుని ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల అనంతరం బుధవారం గణేశుని నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దేవబత్తిని కిషోర్ బాబు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గణేశుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ నాయకులు కందాల వీరేంద్ర గౌడ్, వాంకుడోత్ సురేష్ నాయక్, రమేష్, వెంకటేశ్వర్లు పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నెపొంగు బాబుకు ఉత్తమ రక్తదాత పురస్కారం



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: సీనియర్ ఫిజిక్స్ లెక్చరర్ అన్నెపంగు బాబుకు ఉత్తమ రక్తదాత పురస్కారం లభించింది. భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) లోని పిఎస్ ఫంక్షన్ హాల్ లో వేడుకగా జరిగిన పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో అతిథులు అన్నె పొంగు బాబుకు పురస్కారాన్ని అందించారు. అన్నెపొంగు బాబు సీనియర్ ఫిజిక్స్ లెక్చరర్ గా హైదరాబాదులో పలు ప్రముఖ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్నారు. విద్యార్థులను ఐఐటి, జేఈఈ మెయిన్స్ , ఈఏపీ సెట్ లలో అత్యుత్తమ ర్యాంకులు వచ్చేలా తీర్చిదిద్దడంతోపాటు ఫిజిక్స్ సబ్జెక్టులో వేలాదిమంది విద్యార్థులను అత్యుత్తమ అత్యధిక మార్కులు సాధించేలా పటిష్ట బోధన అందిస్తూనే స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాలలోనూ చురుకుగా పాల్గొంటున్నారు. దీంతోపాటు ఆకలిగా ఉన్నవారికి రైల్వే స్టేషన్, బస్టాండ్లలో , ఫుట్పాతులపై ఉన్న అభాగ్యులకు అన్నం పొట్లాలను తానే సొంతంగా తయారు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థుల చదువులకు వెన్నంటి ఉంటూ ఆర్థిక సహాయం చేస్తున్నారు. నిరుపేదలకు నిత్యవసర సరుకులను అందించి దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. గత దశాబ్ద కాలంగా ఇప్పటివరకు బాబు 14 సార్లు రక్తదానం, ఐదుసార్లు ప్లేట్లెట్స్ ను దానం చేసి ఎందరికో ప్రాణ రక్షణ చేశారు. ప్రమాదంలో రక్తం కోల్పోయిన వారికి పలు సర్జరీలలో రక్తం అవసరం అయినప్పుడు ఆ విషయాన్ని తెలుసుకున్న బాబు వెను వెంటనే స్వచ్ఛందంగా స్పందించి బాధితులకు రక్తదానం చేసి తన మానవతా దృక్పథాన్ని చాటి చెప్తున్నారు. పురస్కారం అందుకున్న అన్నెపొంగు బాబు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలని ఆపదలో రక్తం అవసరం ఉన్నవారికి రక్తదానం చేసి బాధితులను బతికించాలని పిలుపునిచ్చారు. ఉత్తమ రక్తదాత పురస్కారం అందుకున్న బాబును లెక్చరర్లు, బంధుమిత్రులు , విద్యావంతులు , యువకులు, ,మిత్రులు, బాబు సతీమణి లావణ్య, అక్క రజిత , జర్నలిస్ట్ నాగరాజు, నంద్రు నరేష్ తదితరులు అభినందనలు తెలియజేశారు. రక్తదానంలో స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నందుకు గాను అన్నెపొంగు బాబును భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ సంస్థకు నిర్వాహకులు కురుమేటి నవీన్, వేగూరు హేమంత్ అన్నెపొంగు బాబును సంస్థ ఉపాధ్యక్షులుగా నియమించారు. రక్తదాతలు సంస్థకు సంబంధించిన ఇతర వివరాల కోసం 8309130933 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని ఫిజిక్స్ లెక్చరర్ అన్నెపొంగు బాబు తెలియజేశారు.

## యాడికి లో వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం



యాడికి సెప్టెంబర్ 23 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరీ కళ్యాణ మండపం వేదికగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశం తాడిపత్రి నియోజకవర్గ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. రాబోయే రాజకీయ సమరానికి తాము సిద్ధంగా ఉన్నామని పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ప్రకటించాయి. కేవలం సాధారణ భేటీలా కాకుండా తాడిపత్రి రాజకీయాల్లో పెను మార్పులకు శ్రీకారం చుట్టేలా, ప్రత్యర్థి వర్గాల్లో గుబులు రేపేలా ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. ఈ ఉక్కు సంకల్ప విస్తృతస్థాయి సమావేశానికి తాడిపత్రి మాజీ శాసనసభ్యులు, ప్రజానాయకుడు కేతిరెడ్డి పెద్దారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని, అంతులేని ఉత్సాహాన్ని నింపారు. ఆయన కళ్యాణ మండపానికి చేరుకోగానే నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పడుతూ 'జై జగన్', 'జై పెద్దారెడ్డి' అనే నినాదాలతో పరిసర ప్రాంతాలను హోరెత్తించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనసందోహంతో కళ్యాణ మండప ప్రాంగణమంతా కళకళలాడింది. ఈ సందర్భంగా కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ.. తాడిపత్రి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండానే మళ్ళీ ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుంచే సమరసన్నాహాలు ప్రారంభించాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ధైర్యంగా తిప్పికొడుతూ వైఎస్సార్‌సీపీ తెగించి పోరాడుతుందని స్పష్టం చేశారు. పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు తానే అన్ని వేళలా అండగా ఉంటానని, భయపడే ప్రసక్తే లేదని ఘాటుగా హెచ్చరించారు. అనంతరం పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులకు, ప్రాణమిచ్చే కార్యకర్తలకు అధికారికంగా నూతన ఐడీ కార్డులను పెద్దారెడ్డి స్వయంగా అందజేశారు. ఐడీ కార్డు పట్టుకున్న ప్రతి కార్యకర్తా ఒక సైనికుడిలా వైఎస్సార్‌సీపీ విజయం కోసం రణరంగంలోకి దిగి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంతో యాడికి మండలంలో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో సరికొత్త ఊపు రాగా, రాబోయే స్థానిక పోరులో పార్టీ జయకేతనం ఎగురవేయడం ఖాయమని స్థానిక నాయకులు ధీమా వ్యక్తం చేశారు..

## యాడికి అయ్యప్ప స్వామి ఆలయంలో వైభవంగా పడి పూజ, భజన కార్యక్రమం



యాడికి సెప్టెంబర్ 23 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో బుధవారం సాయంత్రం పడి పూజ మరియు భజన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. వేల్లబోయిన విశ్వనాథ్ (విశ్వ టీ కొట్టు) మరియు వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో సాయంత్రం 7 గంటల నుండి 8 గంటల వరకు స్వామి వారికి ప్రత్యేక పడి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలపించిన భజన కీర్తనలు, "స్వామియే శరణం అయ్యప్ప" నామస్మరణలతో ఆలయ ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో మారుమోగింది. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ భిక్ష (అన్నదానం) కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, గురుస్వాములు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి, కృపకు పాత్రులయ్యారు..

## రూ 77 వేలకు ఘనంగా లడ్డు వేలం పాట,



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: గణేష్ నవరాత్రులలో భాగంగా ముస్తఫా నగర్ పెట్రోల్ బంకు వెనుక భాగంలో 18వ డివిజన్లో ముక్తిదాయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపంలో బుధవారం లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 77,777 రూపాయలకు కూరపాటి ఉదయ్ సుమన్, ప్రమీల దంపతులు లడ్డును సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజేత దంపతులకు ముక్తిదాయ ఉత్సవ కమిటీ తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## రెండు బైకులు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



వైరా, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇందిరమ్మ కాలనీకి చెందిన తెలంగాణ ఉద్యమకారుల కమిటీ కార్యదర్శి దొంత నరసింహారావుకు తీవ్ర గాయాలయ్యాయి. వైరాలో తన పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న నరసింహారావును ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఇంద్రకీలాద్రిపై భక్తులకు సరికొత్త సేవలు
## రాష్ట్రంలోనే తొలిసారిగా 'లడ్డూ ప్రసాదం ఏటీఎం' ప్రారంభం



విజయవాడ, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయ):-శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (ఇంద్రకీలాద్రి) కొండ దిగువన, అర్జునవీధి ప్రారంభంలోని సెంట్రల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'లడ్డూ ప్రసాదం ఏటీఎం' (స్వయంచాలక లడ్డూ విక్రయ యంత్రం)ను దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ బుధవారం ఉదయం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్, సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా దుర్గగుడి దేవస్థానంలో ఈ స్వయంచాలక యంత్రాన్ని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చిన సందర్భంగా దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ దర్శనార్థం విచ్చేసే భక్తులు ప్రసాదం కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే శ్రమ లేకుండా, త్వరితగతిన లడ్డూ ప్రసాదాన్ని పొందేందుకు ఈ ఆధునిక సాంకేతికత ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులు జరిపి స్వయంగా క్షణాల్లో ప్రసాదం పొందేలా ఈ యంత్రాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రస్తుతం ట్రయల్ రన్ గా ఏర్పాటు చేసామని, ఈ పైలట్ ప్రాజెక్ట్ పనితీరును పరిశీలించిన అనంతరం, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ మరిన్ని యంత్రాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. ఉత్సవాలు, రద్దీ రోజుల్లో కాకుండా సాధారణ రోజుల్లో ఈ యంత్రం భక్తులకు ఉపయోగపడుతుందని భావిస్తున్నామని, దేవాలయ వ్యవస్థ లో సాంకేతికతను అందుబాటులోకి తెచ్చామని, ప్రస్తుతం ఆన్ లైన్ విధానంలో హెచ్చు శాతం సేవల టిక్కెట్లు భక్తులు సులభంగా బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఫేక్ పూజా టికెట్లపై అప్రమత్తంగా ఉండాలని, దళారులను నమ్మి మోసపోవద్దని, కె. రామచంద్ర మోహన్ అన్నారు. దేవాలయ దర్శనాలు, సేవల పేరిట దళారుల ప్రమేయాన్ని ఉపేక్షించేది లేదని దేవాదాయశాఖ కమిషనర్ స్పష్టం చేశారు. విజయవాడ లో ఇటీవల వెలుగుచూసిన ఫేక్ పూజా టికెట్ల వ్యవహారంపై దేవస్థానం అధికార యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిందని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు విజ్ఞప్తి చేస్తూ అపరిచితులను, మధ్యవర్తులను ఆశ్రయించి పూజా టికెట్ల పేరుతో మోసపోవద్దని హెచ్చరించారు. భక్తుల్లో పూర్తిస్థాయి అవగాహన ఉండాలని, ఆలయ సేవలను కేవలం ప్రభుత్వం, దేవస్థానం అధికారికంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్లు, డిజిటల్ యాప్‌లు మరియు అధీకృత కౌంటర్ల ద్వారా మాత్రమే పొందాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పారదర్శకంగా సేవా టికెట్లు పొందాలని, దళారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ఇంద్రకీలాద్రిపై రాబోయే దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని దేవాదాయశాఖ కమిషనర్ తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో సామాన్య భక్తునికే అగ్రస్థానం కల్పించే దిశగా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాద వితరణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. ఎండ, వర్షాల బారిన పడకుండా షెడ్ల నిర్మాణం, నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులందరూ అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.

## సింగరాయపాలెం లో ఉచిత వైద్య శిబిరం విజయవంతం



కొణిజర్ల, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: మండలంలోని సింగరాయపాలెం గ్రామంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వై ఆర్ జీకే కేర్ సమస్త ఎం.ఎల్ హెచ్ పి శృతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా శిబిరములో బీపీ షుగర్ హెచ్ఐవి రక్త పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచిత మందులను కూడా సంబంధించినటువంటి రోగులకు అందజేశారు. సీజన్లో వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్ఐవి సుఖ వ్యాధులు టీబీ వ్యాధులు వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు వ్యక్తి సంవత్సరానికి ఒక్కసారి అయినా హెచ్ఐవి ని టెస్ట్ చేసుకోవాలని హెచ్ఐవి అంటువ్యాధి కాదని వారికి వివరించారు. హెచ్ఐవి సోకినవారిపట్ల వివక్షత భావం లేకుండా చూడాలని వారిని కూడా గౌరవించాలని వారు తెలియజేశారు. ఏఆర్టి మందులు హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఆసరా పెన్షన్ వంటి అవకాశాలు ఉన్నాయని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేము నాగరాజు వై ఆర్ జి కే సమస్త డిఆర్పి శివ సూపర్వైజర్ నరేష్ లింక్ వర్కర్ నాగమణి ఏఎన్ఎంలు విజయ సుగుణ రాణి ఆశా వర్కర్లు జ్యోతి సుధారాణి గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా నిమజ్జన కార్యక్రమం విజయవంతం



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :: ఖమ్మం పట్టణం లోని సహకార నగర్ లోని ప్రసాద్ హైట్స్ లోని వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో కోలాటంతో పూజా కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. కమిటీ వారు ప్లాట్ సభ్యులు సంఘటితంగా సమైక్యంగా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ముగింపు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం పురవీధుల్లో వినాయక ఉత్సవ విగ్రహాలు ఊరేగింపుగా నిర్వహించి ప్రజలకు ప్రసాదాలను అందజేశారు.**

## ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం
-- డాక్టర్ ఎం. భ్రమరాంబకు ఘన సత్కారం




ఒంగోలు, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం (సెప్టెంబర్ 23) ఒంగోలులో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ ఎం. భ్రమరాంబను శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ, విశ్వహిందూ పరిషత్ (విహెచ్ పి), వాసవి విద్యానిధి ఆర్యవైశ్య బాలుర వసతి గృహం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఉమ్మడిగా ఘనంగా సత్కరించారు. సత్కార కార్యక్రమంలో శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం, ధనిశెట్టి రామునాయుడు, విహెచ్‌పి ప్రతినిధి సోమ సుబ్బారావు, వాసవి విద్యానిధి ఆర్యవైశ్య బాలుర వసతి గృహ కోశాధికారి నూనె రామాంజనేయులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లెలమూడి వెంకటేశ్వర్లు మరియు పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

– ఆయుర్వేద వైద్యం ఇంటింటికీ చేరాలి ఈ సందర్భంగా డాక్టర్ భ్రమరాంబ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యాన్ని ప్రతి ఇంటికీ చేర్చాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం 2026-27 సంవత్సరాలకు గాను రూ 4,408 కోట్లను కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, ఒంగోలు నగరంలోని ఈ నాలుగు సంస్థలు ఉమ్మడిగా ఆయుర్వేద అవగాహన సదస్సు, వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం రోజున తనను సత్కరించడం అంటే ఆయుర్వేద గురువులందరినీ గౌరవించడమేనని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం. రమాదేవి, ఎం. శ్రీనివాసరావులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## రోగులు నిరీక్షణ.. సిబ్బంది ముచ్చట్లు




పులిచెర్ల, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయం):మండలంలోని ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవల కోసం వచ్చే రోగులకు కొంతమంది నర్సుల నుంచి సరైన స్పందన లభించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం ఆసుపత్రికి వచ్చిన పలువురు రోగులు అపాయింట్‌మెంట్ కోసం నిరీక్షిస్తుండగా.. సిబ్బంది తమ సంభాషణల్లో నిమగ్నమై ఉండటంతో పట్టించుకోలేదని వాపోయారు. ఆసుపత్రి వైద్యాధికారి రోగులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నప్పటికీ.. కింది స్థాయి సిబ్బంది తీరుపై మాత్రం అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు సిబ్బంది పనితీరును పరిశీలించి, రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కండ్రికలో అంబరాన్నంటిన శ్రీ గణేశ నాధుని నిమజ్జనం సంబరాలు



విజయవాడ, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయ):-64వ డివిజన్ లోని కండ్రికలో శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకులు కాకొల్లు రవి కుమార్ ఆధ్వర్యంలో 8వ గణపతి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 10వ రోజు బుధవారం ఉదయం కాకొల్లు రవి కుమార్, సతీమణి వరలక్ష్మీతో కలిసి తెల్లవారుజామున వినాయకునికి ప్రత్యేక పూజలు, నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను 10 రోజులుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వినాయకుడు విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే దేవుడని, ప్రతి శుభకార్యానికి గణనాథుడి పూజతో శ్రీకారం చుట్టడం మన సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో ఉన్న అన్ని విఘ్నాలు తొలగి అభివృద్ధి, విజయాలు చేకూరాలని శ్రీ వినాయకుడిని వేడుకున్నానని రవికుమార్ అన్నారు. శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్వర్యంలో 8సంవత్సరాల నుండి చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామి వారి సేవకు శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు, సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే సహాయ, సహకారాలను అందజేస్తున్న ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కె.రవికుమార్ ప్రారంభించి భక్తులకు వడ్డించారు. అన్నవితరణ కార్యక్రమంలో సుమారు 5వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 6:30 గంటలకు నిర్వహించిన లడ్డూ వేలం పాటలో మొదటి లడ్డూ ను పెద్ద మొత్తంలో 3,33,000 రుపాయలకు పాడి కాకొల్లు హర్ష కుమార్ చేజిక్కించుకుని గణనాథుని పట్ల తనకున్న భక్తిని చాటుకున్నారు. రెండో లడ్డూ ను 78,000 రుపాయలకు తానా కిరణ్ కుమార్ చేజిక్కించుకుని స్వామి వారి పట్ల తనకున్న భక్తిని చాటుకున్నారు. అనంతరం లడ్డూ లను వేలం పాటలో చెజిక్కించుకున్న ఇరువురి ని నిర్వాహకులు కె.రవికుమార్ ఘనంగా సన్మానించి మేళతాళాలతో ఇంటి వరకూ సాగనంపారు. అనంతరం డి.జే., తీన్మార్ లతో పాటు వివిధ రకాల వేషాధారణలతో కోలాహలంగా వినాయకుని నిమజ్జనం ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో స్థానిక యువత, మహిళా భక్తులు, టీడీపీ పార్టీ నాయకులు , కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు మహేష్, పొలిశెట్టి చంద్ర శేఖర్, పల్లెల రవి, అల్లు నరేంద్ర, తోట సత్యనారాయణ,తోట వెంకట ప్రసాద్,పట్టేం శెట్టి నాగమణి,ఇ. హరికృష్ణ రెడ్డి, చిన్నారులు, స్థానిక భక్తులు, తదితరులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిపి సునీల్ దత్ ను అభినందించిన మందడపు మనోహర్



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల దంసలాపురం వద్దకు నిమజ్జనం కార్యక్రమానికి వచ్చిన ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ ను మాజీ కార్పొరేటర్ మందడపు మనోహర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో పోలీస్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రూ. 1.63 లక్షలకు లడ్డు వేలంపాట



ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: 14వ డివిజన్ విజన్ అపార్ట్మెంట్ లోని గణేష్ మండపం వద్ద లడ్డు వేలం పాట ఆసక్తికరంగా జరిగింది. ఈ పాటలో అపార్ట్మెంట్ వాసులు భారీగా పాల్గొన్నారు. చివరిగా ఎల్లంకి శాంసుందర్ దంపతులు రూ. 1.63 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ నాయకుడు తోడేటి లింగరాజు యాదవ్, అపార్ట్మెంట్ మేనేజమెంట్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## గణనాథుల శోభాయాత్రలో మత సామరస్యానికి ప్రతీకగా సేవా కార్యక్రమాలు



ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో నవరాత్రి ఉత్సవాలు ముగించుకుని నిమజ్జనానికి బయలుదేరిన గణనాథుల శోభాయాత్రలో పాల్గొంటున్న భక్తుల ఆకలి, దాహార్తిని తీర్చేందుకు బోసు బొమ్మ సెంటర్‌లో 32వ డివిజన్ మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పఠాన్ నన్నే ఆధ్వర్యంలో భోజన పంపిణీ కార్యక్రమం, అలాగే ముస్తాఫానగర్ సెంటర్‌లో 22వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పల్లా రోస్ లీనా ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖమ్మం నగర మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు భక్తులకు స్వయంగా భోజనం వడ్డించడంతో పాటు మజ్జిగను కూడా అందించారు. ఈ సందర్భంగా పగడాల నాగరాజు మాట్లాడుతూ "గణనాథుని నిమజ్జన శోభాయాత్రలో పాల్గొంటున్న భక్తులకు సేవ చేసే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉంది. అయితే ఈ కార్యక్రమంలో నన్ను మరింతగా ఆకట్టుకున్న విషయం మతాలకు అతీతంగా మనమంతా ఒక్కటే అనే భావనకు ప్రతీకగా పఠాన్ నన్నే, పల్లా రోస్ లీనా ముందుకు వచ్చి సేవ చేయడం అభినందనలు అని తెలిపారు. పఠాన్ నన్నే, ముస్లిం సోదరుడు, పల్లా రోస్ లీనా క్రైస్తవ సోదరి అయినప్పటికీ హిందువుల పవిత్రమైన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు భోజనం, మజ్జిగ అందిస్తూ సేవ చేయడం నిజంగా అభినందనీయం. మన పండుగలు వేరు కావచ్చు, మన ప్రార్థనా విధానాలు వేరు కావచ్చు కానీ మనుషుల పట్ల ప్రేమ, ఆప్యాయత, సేవాభావం మాత్రం ఒక్కటే. అదే ఖమ్మం నగర గొప్పతనం. ఒకరి పండుగను మరొకరు గౌరవిస్తూ, ఒకరి సంతోషంలో మరొకరు భాగస్వాములవుతూ ముందుకు సాగడం మన సమాజానికి ఎంతో మంచి సందేశాన్ని ఇస్తుంది. గణనాథుల శోభాయాత్రలో భక్తులకు అన్నం పెట్టడం, దాహం తీర్చడం కేవలం ఒక సేవా కార్యక్రమం మాత్రమే కాదు. మత సామరస్యానికి, సోదరభావానికి, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఇలాంటి కార్యక్రమాలు మన మధ్య ఉన్న ప్రేమను, ఐక్యతను మరింత బలపరుస్తాయి. పఠాన్ నన్నే, పల్లా రోస్ లీనా ఈ సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. వారి సేవా స్ఫూర్తి మరెందరికో ఆదర్శంగా నిలవాలి. గణనాథుని ఆశీస్సులతో ఖమ్మం నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పరస్పర ప్రేమాభిమానాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పగడాల నాగరాజు అన్నారు. ఎఈ కార్యక్రమంలో జాన్ అబ్రహాం, సకీనా, యర్రా అప్పారావు,మిట్టపల్లి రవి ,జావేద్, ఎస్ టి సెల్ కన్వీనర్ దొన్ వాన్ శ్రీను,శౌకత్ ,దండగల రాంబాబు,నన్నెబోయిన సురేష్ ,చంద్ పాషా, పోలెపొంగు వెంకట్ ,మున్నా, మునాఫ్,32 వ డివిజన్ ముఖ్య నాయకులు కూచిపూడి కిషోర్, సూరేపల్లి ఉపేందర్, సూరేపల్లి నాగేశ్వరావు, నరాల సాయి, నరేష్, సిద్ధూ, రామారావు,కొంపల్లి రవి, తిరుమల రావు, పాగా సంజీత్, పోతురాజు చైతన్,పాపారావు, చిన్న, కృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొని అన్నదాన కార్యక్రమం ను విజయవంతం చేశారు.

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలి

**– మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ**

**– నిమజ్జనానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసిన మున్సిపాలిటీ అధికారులు**



ఖమ్మం, వైరా, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: గణేష్ నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులు పాటు ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుడు శోభాయాత్రకు బుధ గురువారాల్లో జరిగే సామూహిక గణేష్ నిమజ్జనోత్సవం నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నల్లచెరువు వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవిన్యూ మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. నిమజ్జనం దగ్గర క్రేన్ ఉంచారు.ఆన్లైన్ ద్వారా నిర్వాహకులు నమోదు చేసుకున్నారని వీటిని నిమజ్జనం కొరకు బుధవారం గురువారాల్లో పటిష్ట చర్యలుతీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలని మండప నిర్వాహకులకుఆమె సూచించారు. నిమజ్జనం అనంతరం పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛందంగా సహకరించాలని ఆమె తెలిపారు పరిశుభ్రమైన పచ్చని వైరా కోసం మనందరం బాధ్యత తీసుకోవాలని ఆమె సూచించారు పోలీసులు సూచించిన మేరకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు సహకరించాలని అన్నారు. ఊరేగింపులో డిజేలు భారీ శబ్దాలు ప్రమాదకర విన్యాసాలు దూరంగా ఉండాలని పరిమితికి మించి వ్యక్తులు ను ఎక్కించవద్దని ఊరేగింపు సమయంలో మద్యం తాగి వాహనాలను నడపటం ఇతరలు ఇబ్బంది కలిగించడం వంటి పాల్పడుద్దని ఎక్కడైనా అవాంఛనీయ సంఘటన జరిగిన వెంటనే సమీపంలో పోలీసులకు సమాచారం అందించాలని ఆమె తెలిపారు. దాదాపు బుధ గురువారాల్లో 80 పైగా విగ్రహాలను నల్లచెరువుకు నిమజ్జనానికి వస్తాయని అంచనా వేస్తున్నామని చంద్రకళ తెలిపారుగణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భక్తులు సహకరించాలని అధికారులు కోరారు.

## దేవుడు అనుగ్రహం, కాక తాళియ సంఘటన

**– తుమ్మల చెరువుకి నీళ్లు వదిలిన తుమ్మల**



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: దేవుడు రాత ని ఎవరు చెరపలేరు. ఆయన పేరు మీద ఉన్న చెరువుకి ఆయనే సాగునీరు వదిలారు. ఈ సంఘటన, ఈ దృశ్యం బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని పినపాక నియోజకవర్గంలో అశ్వాపురంలో జరిగింది. అశ్వాపురం మండలంలోని బిజీ కొత్తూరు గ్రామం వద్ద సీతారామ, మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ ఎత్తిపోతల పథకం వద్ద స్విచ్ ఆన్ చేసిన తర్వాత ఆ ఎత్తిపోతల పథకం నీరు తుమ్మల చెరువులోకి వెళతాయి. అంటే తుమ్మల నాగేశ్వరరావు ఇంటి పేరు కూడా తుమ్మలనే, దేవుడు రాసిన రాత, కాకతాళియ సంఘటనలు అలాగే ఉంటాయి.మొత్తం మీద తుమ్మలచెరువు కి సాగునీటిని తుమ్మలనే వదిలారు మరి**

# తిరుమలాపురంలో ఘనంగా సిద్ధి వినాయకుడి నిమజ్జనం



చింతకాని, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: చింతకాని మండలం తిరుమలాపురం గ్రామంలో యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సిద్ధి వినాయక స్వామివారి 25వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, సాయంత్రం భక్తుల కోలాహలం నడుమ శోభాయాత్ర నిర్వహించి అనంతరం శ్రీ సిద్ధి వినాయక స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. వేద పండితులు లక్ష్మీకాంత్ అయ్యగారి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో 25వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు.

### భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ సిద్ధి వినాయక స్వామివారి శోభాయాత్ర ఉత్సాహభరితంగా సాగింది. డప్పు వాయిద్యాలు, భక్తిగీతాలు, జైజై నినాదాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యువత, మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా అలంకరించిన వాహనంపై వినాయకుడి విగ్రహాన్ని ఊరేగించారు. శోభాయాత్ర గ్రామంలోని ప్రతి వీధిలోకి చేరుకున్న సమయంలో భక్తులు తమ ఇళ్ల ఎదుట స్వామివారికి దండం పెట్టుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. కొందరు భక్తులు హారతులు ఇచ్చి స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. యువత డప్పుల మోతకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేయగా, చిన్నారులు, మహిళలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో శోభాయాత్ర ఆద్యంతం భక్తి, ఉత్సాహంతో కొనసాగింది.

### - ఘనంగా నిమజ్జనం

శోభాయాత్ర అనంతరం శ్రీ సిద్ధి వినాయక స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. భక్తులు గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ స్వామివారికి వీడ్కోలు పలికారు. అనంతరం భక్తిశ్రద్ధల మధ్య విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ఆకాంక్షించారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామ ప్రజలు, యువత, మహిళలు, భక్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## శిథిలావస్థ భవనాల్లో నివసించరాదు, వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయ):-విజయవాడ నగరంలో వర్షాల నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన భవనాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదకర భవనాల్లో నివసించకుండా వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. బుధవారం సాయంత్రం కమిషనర్ ధ్యానచంద్ర బిసెంట్ రోడ్, పున్నమిఘాట్, లేబర్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, సితార సెంటర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత భవనాలు, శిథిలావస్థకు చేరిన నిర్మాణాలను పరిశీలించిన కమిషనర్, వర్షాల కారణంగా ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.లేబర్ కాలనీ, హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రమాదకరమైన పాత భవనాల్లో నివసిస్తున్న ప్రజలను అధికారులు వెంటనే గుర్తించి, వారికి పరిస్థితి తీవ్రతను వివరించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కమిషనర్ సూచించారు. నగరంలోని కొండ ప్రాంతాలు, ప్రమాదకర ప్రదేశాలు, శిథిలావస్థ భవనాల్లో నివసిస్తున్న ప్రజలను కూడా పట్టణ ప్రణాళిక అధికారులు గుర్తించి అవసరమైన చోట్ల పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం, మౌలిక వసతులు తదితర సదుపాయాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ రక్షణే ప్రధాన లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని ఆయన కోరారు. అనంతరం పున్నమిఘాట్‌లో జరగనున్న నూా=ూూ కార్యక్రమానికి సంబంధించి విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వసతులను పూర్తిస్థాయిలో కల్పించాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సి. హెచ్. నిర్మల గ్లోరీ, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ పి. అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## అవుట్‌ఫాల్ డ్రెయిన్ల డీసిల్టింగ్ పనులను పరిశీలించిన వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా వేముల శ్యామలాదేవి రోడ్, కండ్రిక జంక్షన్, ఇన్నర్ రింగ్ రోడ్, డీసిల్టింగ్ పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి, అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో కొనసాగుతున్న డీసిల్టింగ్ పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి ఎటువంటి అంతరాయం కలగకుండా విస్తృతంగా డీసిల్టింగ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కేవలం వర్షాలు పడుతున్న సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా డ్రెయిన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ డీసిల్టింగ్ పనులు చేపడుతున్నప్పటికీ, వర్షాలు కురిసే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా డీసిల్టింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నీటి ప్రవాహానికి ఎక్కడా ఆటంకాలు ఏర్పడకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. అనంతరం పాతపాడు లోని ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను కమిషనర్ ధ్యానచంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో క్రమం తప్పకుండా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారా, పరీక్షల నివేదికలు సక్రమంగా ఉన్నాయా, ప్రజలకు శుద్ధమైన తాగునీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారా, ట్రేడ్ లైసెన్స్ ఉందా, ప్లాంట్ పరిసరాల్లో పారిశుధ్య, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నగరంలోని ఆర్ఓ వాటర్ ప్లాంట్లపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ నివేదికలు సమర్పిస్తున్నప్పటికీ, ప్రజలకు అందించే తాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు ఆకస్మిక తనిఖీలు కూడా నిరంతరం నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. నీటి నాణ్యతకు సంబంధించిన నివేదికలు సక్రమంగా లేకపోతే వారి ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు.ప్రజలకు కేవలం శుద్ధమైన, నాణ్యమైన తాగునీరు మాత్రమే అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న తాగునీటిని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నట్లుగానే, ఆర్ఓ వాటర్ ప్లాంట్ల ద్వారా సరఫరా అవుతున్న నీటిని కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడా కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. నిర్మల గ్లోరీ, పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాస్, గోపాలకృష్ణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. అన్నపూర్ణ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయ):-వర్షాల నేపథ్యంలో మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు . బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా టిక్కెల్ రోడ్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, గాయత్రీ నగర్, ఐదవ నంబర్ రూట్, రమేష్ హాస్పిటల్స్ జంక్షన్, లయోలా కాలేజ్ రోడ్, హరిజనవాడ, డెంటల్ కాలేజ్ రోడ్, పుల్లేటికట్ట డ్రెయిన్, ఏలూరు రోడ్, ఎస్.ఆర్.ఆర్. కాలేజ్, గులాబీ తోట తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, రహదారుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా గాయత్రీ నగర్‌లో జరుగుతున్న ఔట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్, పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మాచవరం ఎస్.ఆర్.ఆర్.-సి.వి.ఆర్. కాలేజ్ సమీపంలోని రహదారిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి రహదారిని పునరుద్ధరించాలని సూచించారు. నగరంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులపై గుంతలు ఏర్పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, గుంతలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం గులాబీ తోటలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ ఆహార నాణ్యత, వంటశాల నిర్వహణ, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. క్యాంటీన్‌లో ఏవైనా సమస్యలు గుర్తించిన వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కమిషనర్ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలి ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయ):-కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు చెప్పారు. బుధవారం ఉదయం తూర్పు లోని 11వ డివిజన్ లో ఉన్న రవీంద్ర ఫంక్షన్ హాలులో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై నియోజకవర్గంలోని పేదలకు వైద్య సహాయం నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 కోట్ల విలువైన చెక్కులను లబ్ధిదారులకు స్వయంగా అందచేశారు. ఈ సభకు ముమ్మనేని ప్రసాద్ అధ్యక్షత వహించారు. ంఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈ సీఎంఆర్ఎఫ్‌ను నిర్వహిస్తున్నారన్నారు. గత ఐదు సంవత్సరాల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేవలం ఐదుగురికి కూడా సీఎంఆర్ఎఫ్ కింద చెక్కులను అందచేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కష్టాల్లో పాలుపంచుకోవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ సీఎంఆర్ఎఫ్‌ను నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం ఉంటే సీఎంఆర్ఎఫ్ ద్వారా నూటికి నూరు శాతం అయిన ఖర్చులను లబ్ధిదారులకు అందచేసేవారని, రాష్ట్ర ఆదాయం తక్కువగా ఉన్నా పేదలు అత్యవసరం సమయంలో చేసిన వైద్య ఖర్చుల్లో అధిక శాతం నిధులను ప్రభుత్వం ఈ సీఎంఆర్ఎఫ్ ద్వారా వారికి అందచేస్తుందన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ అమలుకు ఒక్క రూపాయి కూడా తగ్గించకుండా ఇటు సీఎంఆర్ఎఫ్‌ను సమర్థవంతంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు మరింతగా మద్దతు తెలపాలని కోరారు. అంతేకాకుండా ప్రజలకు మరింత ఎక్కువ మందికి ఈ సీఎంఆర్ఎఫ్ గురించి తెలుసుకొని దరఖాస్తు చేసుకుని లబ్ధిపొందాలని ఎమ్మెల్యే కోరారు.జనసేన పార్టీ నాయకుడు అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ తూర్పు లోని ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చే ఏకైక నాయకుడు ఎమ్మెల్యే గద్దె అని అన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా అన్ని సమయాల్లో ప్రజలకు అండగా ఉండే మనస్సున్న నాయకుడు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అని చెప్పారు. వైద్య సహాయం కోసం వెళ్ళిన వారికి తన సొంత నిధుల నుంచి వారికి ఆర్థిక సహాయం చేసే మారాజు గద్దె అని అన్నారు. ఈ విషయాలను రాష్ట్రంలోని ఏ ఎమ్మెల్యే లేదా సీనియర్ నాయకుడిని అడిగినా చెబుతారని అన్నారు. రానున్న రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాదెండ్ల రాజేష్, దేవినేని అపర్ణ, పేరేపి ఈశ్వర్, భాగం సాయి ప్రసాద్, సుగసాని రత్నశ్రీ, దయాల శిరీషా గాంధి, జాస్తి సురేష్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, దేవరపల్లి ఆంజనేయులు, గద్దె రమేష్, పడాల గంగాధర్, హరి ప్రసాద్, బంగారు మురళీ, అబ్దుల్ కరీమ్, సింగంశెట్టి రమేష్, గల్లా రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యయుతమైన పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వం

**ఇప్పటికైనా వైసీపీ విధానాలు మార్చుకోకపోతే మనుగడ కష్టం గద్దె అనురాధ**



విజయవాడ, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయ):-గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు నిరసన వ్యక్తం చేయడానికి అవకాశం లేకుండా టీడీపీ నాయకులను హౌస్ అరెస్ట్‌లు చేయించారని, కాని ఇప్పుడు కూటమి ప్రభుత్వం అలా చేయకుండా ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు నిరసన వ్యక్తం చేసుకునే అవకాశాన్ని ప్రజాస్వామ్యయుతంగా కల్పిస్తుంటే, వారు దుర్వినియోగం చేస్తున్నారని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ పేర్కొన్నారు. పటమట అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం విలేఖరుల సమావేశం జరిగింది. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొట్టమొదటి సంతకాన్ని మెగా డీఎస్సీ పైలుపై చేసి సుమారు 16 వేల మందికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. మెగా డీఎస్సీలో ఎటువంటి లోపాలు లేకుండా చేయడమే కాకుండా, ఉపాధ్యాయుల బదిలీల విషయంలో కూడా కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించారని చెప్పారు. గత ప్రభుత్వంలో పాఠశాలలో టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారని, ఇప్పుడు ఉపాధ్యాయులతో అన్ని ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ మరో డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చేందుకు తమ ప్రభుత్వం సిద్ధం అవుతోందని వెల్లడించారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారు శాప్ కార్యాలయానికి వచ్చి వారి సర్టిఫికెట్లను చూపిస్తుంటే వాటిని చూసే ప్రయత్నం కూడా వైసీపీ నాయకులు చేయడంలేదని తెలిపారు. గురువులను దుర్భాషలాడుతూ రాళ్లు, కోడిగుడ్లు విసరడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అమానుష క్రీడలను ఆడుతున్నారని, ప్రజలు వీటిని సహించరని అన్నారు. శాంతియుతంగా చేయాల్సిన నిరసనను వైఎస్సార్‌సీపీ నాయకులు హింసా కాండగా మార్చారని చెప్పారు. దౌర్జన్యం చేయడం ద్వారానే అధికారంలోకి వస్తామనే భ్రమల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారని, దౌర్జన్యాలు చేస్తేనే జగన్ దృష్టిలో పడతామనే ఆలోచనల్లో ఆ పార్టీ నాయకులు ఉన్నారని ఆమె చెప్పారు. గురువులను సదా గౌరవించుకుని మంచి సమాజాన్ని నిర్మించుకుందామని అనురాధ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, గద్దె ప్రసాద్, దయాల శిరీషా, సుగసాని రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## బొండా సిద్ధార్థకు మేయర్‌గా అవకాశం కల్పించాలి
## బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో తీర్మానం



విజయవాడ, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయ):- 33వ డివిజన్ సత్యనారాయణ పురం డివిజన్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ యువనాయకులు బొండా సిద్ధార్థ కు మేయర్ గా అవకాశం కల్పించాలి అని బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థకు మేయర్ అవకాశం కల్పించాలని బ్రాహ్మణ సంఘం తీర్మానం, విజయవాడ అభివృద్ధి, యువతకు ప్రాధాన్యత, ప్రజా సేవలో చురుకైన పాత్రను దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం పార్టీ యువనాయకులు బొండా సిద్ధార్థ కు మేయర్‌గా అవకాశం కల్పించాలని బ్రాహ్మణ సంఘం తీర్మానం చేసింది, విజయవాడ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, బ్రాహ్మణ సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.విజయవాడ నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు యువ నాయకత్వం అవసరమని వారు పేర్కొన్నారు. ఆధునిక ఆలోచనలు, అభివృద్ధిపై స్పష్టమైన దృక్పథం, ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేసే నాయకత్వం నగరానికి అవసరమని అన్నారు. ఈ నేపథ్యంలో సిద్ధార్థ కు మేయర్‌గా అవకాశం కల్పిస్తే విజయవాడ అభివృద్ధికి మరింత వేగం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువతకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా కొత్త ఆలోచనలు, కొత్త విధానాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని బ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. సిద్ధార్థ యువతకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసే యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విజయవాడ నగరంలో పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, ట్రాఫిక్, నగర సుందరీకరణ, యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని డివిజన్లలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ, విజయవాడను మరింత పరిశుభ్రమైన, సుందరమైన, ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.బొండా సిద్ధార్థ ప్రజా సేవా కార్యక్రమాలు, యువతతో ఉన్న అనుబంధం, ప్రజా సమస్యలపై స్పందించే తీరు, నగర అభివృద్ధిపై ఉన్న ఆసక్తిని పరిగణనలోకి తీసుకుని ఆయనకు మేయర్‌గా అవకాశం కల్పించాలని బ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. యువ నాయకత్వానికి అవకాశం కల్పించడం ద్వారా యువతలో మరింత ఉత్సాహం, నమ్మకం పెరుగుతుందని అన్నారు.విజయవాడ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందాలని, నగర అభివృద్ధిలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని వారు ఆకాంక్షించారు. బ్రాహ్మణ సంఘం తరపున సిద్ధార్థ కు మేయర్‌గా అవకాశం కల్పించాలని కోరుతూ చేసిన తీర్మానాన్ని పార్టీ అధిష్ఠానం సానుకూలంగా పరిగణించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.విజయవాడ అభివృద్ధి, యువతకు ప్రాధాన్యత, ప్రజా సేవకు మరింత ప్రోత్సాహం అందించే దిశగా భవిష్యత్‌లో కూడా బ్రాహ్మణ సంఘం తరపున తమ వంతు సహకారం అందిస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ టీడీపీ ఇంచార్జ్ గార్లపాటి విజయకుమార్, కౌండిన్య సనాతన సమితి అధ్యక్షులు వీరుబొట్ల అరుణ్‌కుమార్, వేద చారిటబుల్ సేవా ట్రస్టు అధ్యక్షులు యడ్లపాటి శేషసాయి, పరశురామ గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఉప్పులూరి శేషప్రసాద్ శర్మ, కార్యదర్శి మద్దిరాల మురళీ మనోహర్ శర్మ, సభ్యులు పోతురాజు జనార్ధనరావు, ప్రముఖ బ్రాహ్మణ నాయకులు జోశ్యుల హనుమయ్య సోమయాజి, గండికోట సుబ్రహ్మణ్యశర్మ, తూములూరి శంకరసాయి, వల్లూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనక దుర్గమ్మ వారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబం



విజయవాడ, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా బుధవారం సాయంత్రం శ్రీ కనక దుర్గమ్మ వారిని దర్శనానికి ఇంద్రకీలాద్రికి విచ్చేసిన ఆమెకు దేవస్థానం అధికారులు స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## తెలంగాణకు రెడ్ అలర్ట్

- ఐదు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు
- పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ



హైదరాబాద్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం తో తెలుగు రాష్ట్రాలపై భారీ వర్షాల ముప్పు పొంచి ఉంది. తెలంగాణపై ఈ వాయుగుండం ప్రభావం తీవ్రంగా ఉండనుందని, రాబోయే ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు వరంగల్, హన్మకొండ, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబా బాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ముప్పు ఉండటంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మిగతా పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. భారీవర్షాల ధాటికి భద్రాద్రి కొత్తగూడెం,ఖమ్మం, సూర్యాపేట,మహబూబ్‌నగర్ జిల్లాల్లో వాగులు, వంకలు ఉప్పొంగి ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

## ఢిల్లీలో పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశానికి హాజరైన ఎం పి వద్దిరాజు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ ::: పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షించాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం బుధవారం ఢిల్లీలో సమావేశమైంది.స్థాయీసంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన జరిగిన సమావేశంలో "పెట్రోలియం రంగంలో ఎదురవుతున్న పర్యావరణ సమస్యలు"అనే అంశంపై చర్చించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, వాహనాల సంఖ్యతో పాటు ఇంధనం వాడకం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో వాతావరణం కాలుష్యమై పర్యావరణం బాగా దెబ్బతింటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.మన భావితరాల వారి శ్రేయస్సును కాంక్షిస్తూ పర్యావరణం దెబ్బతినకుండా దాని సమతుల్యాన్ని కాపాడడం అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీ రవిచంద్ర హితవు పలికారు.ఈ సమావేశంలో పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యులతో పాటు మహారాష్ట్ర పరిశ్రమలు,పర్యావరణ, వాతావరణ మార్పులు, పారిశ్రామిక అభివృద్ధి సంస్థ,కాలుష్య నియంత్రణ మండలి శాఖల ఉన్నతాధికారులు,చమురు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.ప్రభుత్వ రంగంలో ఉన్న చమురు సంస్థలు అమలు చేస్తున్న మానవ వనరుల విధానాలను కూడా స్థాయీ సంఘం సమీక్షించింది.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు అధికారులకు పలు సూచనలు చేశారు,సలహాలిచ్చారు.



## బీజేపీ పదవికి బొడ్డుపల్లి ఈశ్వరయ్య రాజీనామా



మాచర్ల, సెప్టెంబర్ 23 : ఆర్ సి ఇన్చార్జి;నేటి శుభోదయ : మాచర్ల పట్టణ భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్ష పదవితో పాటు క్రియాశీల సభ్యత్వానికి బొడ్డుపల్లి ఈశ్వరయ్య రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని బుధవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్చు కాంతికుమార్‌కు పార్టీ కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు, స్వలాభాలకు తాను దూరంగా ఉంటానని తెలిపారు. ప్రస్తుతం తాను బీసీ నవ చైతన్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సంఘం ద్వారా ప్రజలకు మరింత అందుబాటులో ఉంటూ, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తానని ఆయన తెలిపారు.

## నేటితో ముగిసిన ఎంపీటీసీల పదవీకాలం ఎన్నికలు ముగిసే వరకు ప్రత్యేక అధికారి పాలన




కారంపూడి: ఆర్ సి ఇన్చార్జి ;నేటి శుభోదయ : కారంపూడి మండల పరిషత్ ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం నేటితో ( గురువారం) ముగియనుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల ఎంపిటిసి సభ్యుల పదవీకాలం ముగియటంతో ప్రత్యేక అధికారిని నియమించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. నేటితో ఎంపీటీసీ సభ్యులు మాజీలు కానున్నారు. ఈనెల 24వ తేదీన జడ్పిటిసి స్థానం కూడా ఖాళీ కానుంది. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రత్యేక అధికారి పాలనలో ఉండనుంది.

## ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్



విజయపురిసౌత్:ఐటిడిఏ శ్రీశైలం ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీ వెంకట స్వామి నాయుడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బెల్లంకొండ వారి పాలెం,ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (పి.టి.జి బాయ్స్) ను ఆకస్మికంగా తనిఖీ చేసినారు. పాఠశాల విద్యార్థులకు అందుతున్న భోజన వసతులను పరిశీలించారు. పాఠశాలకు సప్లై చేస్తున్న సరుకుల యొక్క నాణ్యతను కూడా పరిశీలించడమైనది. విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్ఎం టి వెంకటేశ్వర్లు సూచించడం అయినది. విద్యార్థులకు సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బందితో మాట్లాడి వారికి విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు గురించి సూచనలు ఇవ్వడం జరిగింది.అదే విధంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (పి.టి.జి బాయ్స్) కిచెన్ షెడ్ రిపేర్స్ పరిశీలించి త్వరగా పూర్తిచేయలని ఆదేశాలు ఇచ్చారు. వంట సిబ్బందితో మాట్లాడి మెనూ విషయములు పూర్తిగా అమలుపరచాలని డిప్యూటీ వార్డన్ కి ఆదేశాలు ఇచ్చారు. తదుపరి ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడి అకాడమిక్ విషయాలు తెలుసుకొని, పాఠశాలకు హాజరు కాకుండా ఇంటి వద్ద ఉన్న పిల్లలను వెంటనే బడికి పిలిపించాలని, తరగతి వారీగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి పాఠశాలలో జరుగుతున్న ప్రతి కార్యక్రమాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్ళే బాధ్యతను ఆయా హౌస్ మాస్టర్ మరియు క్లాస్ టీచర్స్ తీసుకోవాలని తెలిపారు.ఈకార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాయుగుండం ప్రభావం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**గండేపల్లి ఎండీవో**

కాకినాడ జిల్లా,గండేపల్లి, సెప్టెంబర్ 23 నేటి శుభోదయ: వాయుగుండం ప్రభావం మండలంపై అధికంగా ఉన్నప్పటికీ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గండేపల్లి ఎండీవో కర్రి హరికృష్ణ సత్యారెడ్డి తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలన్నీ చేపట్టామని, ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు పాటించాలని కోరారు.బుధవారం రాత్రి ఎండీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు.

## జిల్లా ఆర్యవైశ్య మీడియా కమిటీ వైస్ చైర్మన్‌గా ఓరుగంటి



మాచర్ల, సెప్టెంబర్ 23: ఆర్ సి ఇన్చార్జ్;నేటి శుభోదయ : పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ వైస్ చైర్మన్‌గా ఓరుగంటి చెన్నకేశవరావు నియమితులయ్యారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-204ఏ రీజనల్ చైర్మన్‌గా సేవలందిస్తున్న చెన్నకేశవరావుకు పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చెందోలు వికేఎస్ ప్రకాష్‌రావు నియామక పత్రాన్ని అందజేశారు.2026--2028 వరకు రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఆశయ సాధనకు కృషి చేస్తూ, జిల్లా వ్యాప్తంగా ఆర్యవైశ్యులను చైతన్యపరచాలని ప్రకాష్‌రావు సూచించారు. ఆర్యవైశ్యుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.ఈ సందర్భంగా చెన్నకేశవరావు మాట్లాడుతూ తనను మీడియా కమిటీ వైస్ చైర్మన్‌గా ఎంపిక చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.చెన్నకేశవరావును పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు, జర్నలిస్టులు, పట్టణ ప్రముఖులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## కండ్రికలో అంబరాన్నంటిన శ్రీ గణేశ నాథుని నిమజ్జనం సంబరాలు



విజయవాడ, సెప్టెంబర్ 23 (నేటి శుభోదయ):-64వ డివిజన్ లోని కండ్రికలో శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకులు కాకొల్లు రవి కుమార్ ఆధ్వర్యంలో 8వ గణపతి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 10వ రోజు బుధవారం ఉదయం కాకొల్లు రవి కుమార్, సతీమణి వరలక్ష్మీతో కలిసి తెల్లవారుజామున వినాయకునికి ప్రత్యేక పూజలు, నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను 10 రోజులుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వినాయకుడు విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే దేవుడని, ప్రతి శుభకార్యానికి గణనాథుడి పూజతో శ్రీకారం చుట్టడం మన సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో ఉన్న అన్ని విఘ్నాలు తొలగి అభివృద్ధి, విజయాలు చేకూరాలని శ్రీ వినాయకుడిని వేడుకున్నానని రవికుమార్ అన్నారు. శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్వర్యంలో 8సంవత్సరాల నుండి చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామి వారి సేవకు శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు, సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే సహాయ, సహకారాలను అందజేస్తున్న ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కె.రవికుమార్ ప్రారంభించి భక్తులకు వడ్డించారు. అన్నవితరణ కార్యక్రమంలో సుమారు 5వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 6:30 గంటలకు నిర్వహించిన లడ్డూ వేలం పాటలో మొదటి లడ్డూ ను పెద్ద మొత్తంలో 3,33,000 రుపాయలకు పాడి కాకొల్లు సాయి హర్ష చేజిక్కించుకుని గణనాథుని పట్ల తనకున్న భక్తిని చాటుకున్నారు. రెండో లడ్డూ ను 78,000 రుపాయలకు తానా కిరణ్ కుమార్ చేజిక్కించుకుని స్వామి వారి పట్ల తనకున్న భక్తిని చాటుకున్నారు. అనంతరం లడ్డూ లను వేలం పాటలో చెజిక్కించుకున్న ఇరువురి ని నిర్వాహకులు కె.రవికుమార్ ఘనంగా సన్మానించి మేళతాళాలతో ఇంటి వరకూ సాగనంపారు. అనంతరం డి.జే., తీన్మార్ లతో పాటు వివిధ రకాల వేషాధారణలతో కోలాహలంగా వినాయకుని నిమజ్జనం ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో స్థానిక యువత, మహిళా భక్తులు, టీడీపీ పార్టీ నాయకులు , కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు మహేష్, పొలిశెట్టి చంద్ర శేఖర్, పల్లెల రవి, అల్లు నరేంద్ర, తోట సత్యనారాయణ,తోట వెంకట ప్రసాద్,పట్టేం శెట్టి నాగమణి,ఇ. హరికృష్ణ రెడ్డి, చిన్నారులు, స్థానిక భక్తులు, తదితరులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

